


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ 08-09-2026 మంగళవారం సంపుటి : 13 | సంచిక :308 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on

# కమ్యూనిస్టుల పోరాటం..
# కాంగ్రెస్ పరిష్కారం

**రైతాంగానికి 'వాకింగ్ ఎన్సైక్లోపీడియా' కామ్రేడ్ సారంపల్లి**
**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**
**కామ్రేడ్ మల్లారెడ్డి స్మారకార్థం కీలక నిర్ణయం తీసుకుంటామన్న ముఖ్యమంత్రి**
**ఓట్ల తొలగింపుపై 'ఎర్రజెండా' అప్రమత్తంగా ఉండాలి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం) :**

హైదరాబాద్:
ఆరు దశాబ్దాల పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి వరకు రైతులు, కౌలు రైతులు, రైతు కూలీల హక్కుల సాధనకై తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. రవీంద్రభారతిలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ (AIKS) జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.




వ్యవసాయ రంగానికి 'వాకింగ్ ఎన్సైక్లోపీడియా'
సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నేల సారం, నీరు, విత్తనం, పెట్టుబడి నుంచి ప్రారంభించి పంట విక్రయం, గిట్టుబాటు ధర వరకు వ్యవసాయ రంగంలోని ప్రతి అంశంపై మల్లారెడ్డికి అపారమైన అవగాహన ఉందన్నారు. రైతాంగ సమస్యలపై ఆయనకున్న పరిజ్ఞానాన్ని ప్రస్తావిస్తూ మల్లారెడ్డిని వ్యవసాయ రంగానికి లభించిన "వాకింగ్ ఎన్సైక్లోపీడియా"గా అభివర్ణించారు. సమాజంలో పదవులు, హోదాల కంటే రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఇటువంటి నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం రాష్ట్ర రైతాంగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన రాసిన పుస్తకాలు, లేవనెత్తిన అంశాలను అధ్యయనం చేసి ప్రజా ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

**వామపక్షాల పోరాటాలు**
**– కాంగ్రెస్ పరిష్కారాలు**
వామపక్షాలు ప్రజా సమస్యలపై నిర్వహించిన పోరాటాలను గుర్తించి, కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటికి చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాయని సీఎం గుర్తుచేశారు:
కనీస వేతన చట్టం: నిరుపేద కూలీలకు కనీస వేతనం అందించాలని కమ్యూనిస్టులు పోరాడగా, కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమల్లోకి తెచ్చింది.
**భూ పంపిణీ:** 'దున్నేవాడిదే భూమి' నినాదంతో వచ్చిన ఉద్యమాల ఫలితంగా ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తెచ్చి, దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు సుమారు 24.56 లక్షల ఎకరాల మిగులు, పోడు భూములను పంపిణీ చేసింది.
**ఇందిరమ్మ ఇండ్లు & ఎంఎస్‌పీ:** వామపక్షాల డిమాండ్ మేరకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర (MSP) విధానాన్ని అమలులోకి తెచ్చింది.
**ఉపాధి హామీ & ఆహార భద్రత:** కరువు కాలంలో పేదలకు ఆసరాగా నిలిచేందుకు ఉపాధి హామీ చట్టం, ఉచిత ధాన్య పంపిణీకై ఆహార భద్రతా చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు రూపొందించాయి.

**ఓటర్ల హక్కులపై కుట్ర – అప్రమత్తంగా ఉండాలి**
ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా గెలవలేక ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వేలు చేయిస్తూ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరియు బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని సీఎం ఆరోపించారు. ఎస్ఐఆర్ (SIR) పేరుతో జరుగుతున్న ఈ ఓట్ల తొలగింపుపై ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు అప్రమత్తంగా ఉండాలని, పేదల ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.
చిరస్థాయిగా మల్లారెడ్డి జ్ఞాపకాలు
తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినట్లే, రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్థాయిగా నిలిచిపోయేలా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
ఈ సంస్మరణ సభలో రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, పలువురు శాసనసభ్యులు, సీపీఎం జాతీయ నాయకులు ప్రకాశ్ కారత్, జాన్ వెస్లీతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# డిజిటల్ విప్లవంలో
# మరో అడుగు
## రూ. 34,800 కోట్లతో వికాస పర్వం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఎఎంఎస్) :**
గుజరాత్‌లోని వడోదరలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే బహిరంగ సభకు సంబంధించిన సీట్లన్నీ బుకింగ్ ప్రారంభమైన గంట వ్యవధిలోనే పూర్తయ్యాయి. ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో' ద్వారా ఉచిత నమోదు ప్రక్రియను నిర్వహించడం ప్రభుత్వ వర్గాల ప్రకారం దేశంలోనే ఇది మొదటిసారి కావడం విశేషం.

**డిజిటల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ మరియు ప్రవేశం**
వడోదర మున్సిపల్ కార్పొరేషన్ ఈ సభ ప్రవేశాల కోసం ప్రైవేట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించింది. సీట్లన్నీ నిండిపోవడంతో నమోదు ప్రక్రియను నిలిపివేశారు. అయితే, అప్పటికే మరో 42,000 మందికి పైగా దరఖాస్తుదారులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. సభ వద్ద డిజిటల్ ప్రవేశం కోసం కూడా ఈ విధానాన్నే ఉపయోగిస్తారు. నమోదు చేసుకున్న వారికి బుక్‌మైషో ఖాతా ద్వారా ప్రత్యక్ష క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎంటికెట్ అందుతుంది. వేదిక వద్ద ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, సజావుగా ప్రవేశం కల్పించడానికి ఈ సాంకేతికతను ఏర్పాటు చేశారు.

**రూ. 20,700 కోట్ల వ్యయంతో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్**
మంగళవారం వడోదరలో పర్యటించనున్న ప్రధాని మోదీ పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. వీటిలో ప్రధానంగా వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు చెందిన 326 కిలోమీటర్ల పొడవైన మూడు విభాగాలను జాతికి అంకితం చేయనున్నారు. సానంద్ (ఉత్తర)మకర్పుర, న్యూ ఉంబర్‌గావ్‌న్యూ సఫాలే, న్యూ సఫాలేజేఎన్‌పీటీ విభాగాలను రూ. 20,700 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేశారు. ఇవి జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీకి నేరుగా అనుసంధానాన్ని కల్పించి, పారిశ్రామిక కేంద్రాల నుంచి ఓడరేవులకు సరుకు రవాణాను వేగవంతం చేస్తాయి.

**కొత్త రైల్వే సేవలు - మౌలిక వసతుల విస్తరణ**
న్యూ సానంద్, న్యూ మకర్పుర, న్యూ ఉంబర్‌గావ్, ముంబైలోని న్యూ జేఎన్‌పీటీల నుంచి సరుకు రవాణా రైలు సేవలను ప్రధాని ప్రారంభించనున్నారు. దీంతో పాటు వడోదర, ఛోటా ఉదేపూర్, అలీరాజ్‌పూర్ జిల్లాల ప్రయాణికులకు లబ్ధి చేకూర్చేలా వడోదర మరియు తాండా రోడ్ మధ్య కొత్త రైలు సేవలను జెండా ఊపి ప్రారంభించనున్నారు.
రూ. 9,700 కోట్లకు పైగా వ్యయంతో 329 కిలోమీటర్ల మేర విస్తరించే మూడు రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో వడోదరరత్లాం మూడో, నాలుగో రైల్వే లైన్లు, మియాగామ్ కర్జన్‌చోరండా మల్సార్ గేజ్ మార్పిడి, విశ్వామిత్రిదభోయ్ ట్రాక్ రెట్టింపు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితో పాటు రూ. 1,780 కోట్ల విలువైన మూడు జాతీయ రహదారి ప్రాజెక్టులు, రూ. 2,600 కోట్ల విలువైన గుజరాత్ ప్రభుత్వ ప్రాజెక్టులకు కూడా ఆమోదం తెలుపనున్నారు.

**ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026**
వడోదర కార్యక్రమం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ముంబైకి చేరుకుంటారు. అక్కడ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ఏడో ఎడిషన్‌ను ఆయన ప్రారంభిస్తారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ సదస్సులో ఆర్థిక రంగంలో సరికొత్త పరిణామాలు, ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టోకెనైజేషన్, క్వాంటమ్ సాంకేతికతలపై విధాన నిర్ణేతలు, ఆర్థిక సంస్థలు మరియు సాంకేతిక నిపుణులు చర్చించనున్నారు.

# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి ఆలోచన



హైదరాబాద్:
శాసనసభ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసుల ప్రవర్తనను రాష్ట్ర ప్రజలంతా గమనించారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.
అసెంబ్లీ వద్ద దుశ్శాసన పర్వం
సభకు వస్తున్న బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు అరాచకానికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. సీనియర్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని గొంతు నొక్కేందుకు యత్నించారని, ఆమెపై జరిగిన ఈ దాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సహచర ఎమ్మెల్యే కోవా లక్ష్మి సమయస్ఫూర్తితో ఆదుకోకపోతే సునీతా లక్ష్మారెడ్డి ఇనుప కంచెలపై పడి తీవ్రంగా గాయపడేవారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణం నేడు దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని విమర్శించారు.
**డైవర్షన్ రాజకీయం – నిలదీత :** పాలనను వదిలేసి విధ్వంసం, గందరగోళం, ప్రజల దృష్టిని మళ్లించడం (డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్) మాత్రమే సీఎం రేవంత్‌కు తెలుసని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన భౌతిక దాడి నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రకమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవాలని స్పీకర్ ఆదేశించారంటూ పోలీసులు చెబుతున్నారని వెల్లడించారు.
**స్పీకర్‌పై అవిశ్వాసం యోచన :** ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామనే ముందస్తు భయంతోనే తమను అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. బాధితులైన మహిళా ఎమ్మెల్యేలకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని, హోంమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి దీనికి జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.

# విరిగిన ఎముకలకు చికిత్స ఉంటుంది..
# మరి కరిగిన కలల సంగతేంటి ?


**మోదీ, సమ్రాట్ చౌదరిలపై రాహుల్ మండిపాటు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (ఎఎంఎస్) :**
బీహార్‌లో పరీక్షల నిర్వహణలో అక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జ్ తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరిల వైఖరిని ఎండగడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసుల దాడిలో గాయపడిన అభ్యర్థుల విరిగిన ఎముకలకు వైద్యులు చికిత్స అందించి బాగు చేయగలరని, కానీ ఈ వ్యవస్థ వల్ల కరిగిపోయిన వారి భవిష్యత్తు కలలను తిరిగి పునరుద్ధరించగలరా అని ఆయన ప్రశ్నించారు.
రాహుల్ గాంధీతో విద్యార్థుల భేటీ
బీహార్‌కు చెందిన బాధిత విద్యార్థులు, నిరుద్యోగ యువతతో ఇటీవల తాను జరిపిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. పరీక్షల వ్యవస్థలోని అక్రమాలను ప్రశ్నించినందుకు విద్యార్థులు పోలీసుల నుంచి తీవ్రమైన హింసను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో పారదర్శకత, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ జవాబుదారీతనం అనే మూడే మూడు డిమాండ్లను మాత్రమే అడిగినందుకు విద్యార్థులపై బలప్రయోగం చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు.
పాట్నాలో నిరుద్యోగుల ఆందోళనలు
ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో ఒకే దశ పరీక్షను నిర్వహించాలని, రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల పాట్నాలో నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ముఖ్యమంత్రి నివాస ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా పోలీసులు అభ్యర్థులపై విచక్షణారహితంగా దాడి చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.
మహారాష్ట్రలోనూ విద్యార్థుల నిరసనలు
ఇదే తరహాలో మహారాష్ట్రలోనూ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విషయాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించారు.




# ఇంతే కదా...!




**1,500కు పైగా విమానాలు రద్దు, వేలాదిమంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు**

ఇండోనేసియాలోని సుందా జలసంధి వేదికగా ప్రసిద్ధ 'అనక్ క్రాకటా' అగ్నిపర్వతం తీవ్రస్థాయిలో పేలింది. అగ్నిపర్వతం నుంచి దట్టమైన పొగ, భారీ ఎత్తున బూడిద ఆకాశంలోకి ఎగసిపడుతుండటంతో విమాన రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. శుక్రవారం నుంచే క్రియాశీలకంగా మారిన ఈ పర్వతం ఆదివారం తెల్లవారుజామున మొదటిసారిగా బద్దలైంది.


# మాటల ప్రభుత్వం కాదు..
# చేతల ప్రభుత్వం

**రూ. 200 కోట్లతో విశ్వనగరంగా 'ధర్మపురి' క్షేత్రం: శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి లక్ష్మణ్**

**ధర్మపురి, సెప్టెంబర్ 7 (వుదయం) :**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన శోభను సంతరించుకోనుంది. దశాబ్దాలుగా భక్తులు, స్థానికులు కోరుకుంటున్న ఆలయాభివృద్ధి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గతంలో మంజూరు చేసిన రూ. 117 కోట్లకు అదనంగా మరో రూ. 80 కోట్లను కేటాయించి, మొత్తం రూ. 200 కోట్లతో క్షేత్రాభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సోమవారం వేకువజామున 2:58 గంటలకు వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో రూ. 10 కోట్లతో చేపడుతున్న శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు వైభవంగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.
స్వామివార్ల దర్శనం - వేదాశీర్వచనం
కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకులు వారికి మంత్రోచ్చారణల



తో వేదాశీర్వచనం గావించి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.
అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా ధర్మపురి
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... "ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధిపై గత పాలకులు మాటలు చెప్పారే తప్ప నిధులు ఇవ్వలేదు. కానీ మన ప్రజా ప్రభుత్వం స్వామివారి దివ్యానుగ్రహంతో ముందే రూ. 117 కోట్లు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలతో మరో రూ. 80 కోట్లు అదనంగా కేటాయించాం. మొత్తంగా రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురిని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతున్నాం" అని తెలిపారు. అలాగే బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి ప్రవాహం వెంట ఉన్న ఆలయాలను అభివృద్ధి చేస్తూ గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.



## హామీల అమలుపై బీఆర్ఎస్ పోరు



- మండల అధ్యక్షుడు వీరారెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం

ఉర్కొండ న్యూస్
సెప్టెంబర్ 7:వుదయం ప్రతినిధి

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఉర్కొండ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు సమర్పించారు.
ఉర్కొండ మండలం మాధారం గ్రామానికి చెందిన ధ్యాప వీరారెడ్డి సమర్పించిన వినతిపత్రంలో, కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, 13 గ్యారంటీలు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని, 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు.
తమ కుటుంబంలోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన తన వినతిలో కోరిన ప్రధాన అంశాలు: మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం రైతులకు రైతు భరోసా, ఎరువుల సబ్సిడీ, పంటలకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ రైతు కూలీలకు ఏటా రూ.12,000 సాయం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణానికి సాయం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులకు పెన్షన్లు పెంపు ఆడపిల్లలకు ఏటా రూ.12,000 ఆర్థిక సాయం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో BRS మండల ముఖ్య నాయకులు brs సర్పంచ్ లు పాల్గొన్నారు

## బాపునగర్ యువత అద్భుత సేవ



నారాయణపేట
సెప్టెంబర్ 7(వుదయం ప్రతినిధి)

నారాయణపేట మున్సిపాలిటీ పరిధి అయిదవ వార్డు బాపు నగర్ లో యువత రోడ్డు మరమ్మతులను చేసి ప్రమాదాల నివారణకు కృషి చేశారు. ఎక్సైజ్ కార్యాలయం నాగుల ముందు ఉన్న ఈ రోడ్డు మూల మలుపు కావడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఆటంకం ఉండడంతో యువత ముందుకు వచ్చి రోడ్డు మరమ్మతు చేశారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ఆ రోడ్డు మలుపు దగ్గర ద్విచక్ర వాహనాలపై నుండి కొందరు కింద పడటంతో స్పందించిన బాపునగర్ యువత సోమవారం స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు చేశారు. దీనితో ఆ వార్డు ప్రజలు వారిని అభినందించారు.

## విద్యార్థుల ఫీజుల తక్షణ చెల్లింపు




సెప్టెంబర్ 7
(వు దయం ప్రతినిధి) మరికల్

మండల కేంద్రంలోని బిజెపి మండల నాయకులు తెలంగాణ రాష్ట్ర బిజెపి పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బిజెపి నాయకులని మరికల్ పోలీసులు అరెస్టు చేశారు బిజెపి నాయకులు మాట్లాడుతూ వెంటనే తెలంగాణ రాష్ట్రం విద్యార్థులకు వెంటనే చెల్లించాలని బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యార్థులకు చదువులకు ఇబ్బందులు అవుతాయని వాళ్ళు అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరెస్టు చేసి సాయంత్రం వేళ విడుదల చేశారు

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..



మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ లో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం జరిగిందని మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించామన్నారు.ఉపాధ్యాయుల దేశ నిర్మాతలే కనుక వారిని ప్రోత్సహించినట్లయితే విద్యార్థులకు మంచి విద్యనందిస్తారని భవిష్యత్ తరాలకు ఉపాధ్యాయులు ఎంతో అవసరమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ బుకింగ్ గడువు తగ్గింపు




నాగర్ కర్నూల్,
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గించినట్లు శ్రీనివాస యుటిలిటీ గ్యాస్ ట్రేడర్స్ (హెచ్ పీ) డీలర్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ బుకింగ్ మధ్య 45 రోజుల వ్యవధి ఉండగా తాజాగా దానిని 25 రోజులకు కుదించారు. దీంతో వినియోగదారులు ఒక సిలిండర్ బుక్ చేసుకున్న 25 రోజుల తర్వాత మరో సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం లభించనుంది. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే 25 రోజుల గడువు అమల్లో ఉంది.తాజా నిర్ణయంతో గ్రామీణ వినియోగదారులకు అవసరానికి అనుగుణంగా బుకింగ్ చేసుకునే వెసులుబాటు కలగనుందని ఆయన పేర్కొన్నారు.

## వ్యవసాయానికి పెద్దపీట.. కదం తొక్కనున్న రైతాంగం!

* అపర భగీరథుడి మాట – తెలంగాణకు బంగారు బాట
* సాగునీటి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా మరో బృహత్తర ఉద్యమం
* లక్షలాది మంది చూపు.. కేసీఆర్ మేధో విశ్లేషణ వైపే!
* శాసనసభ వేదికగా కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సమరశంఖం



సిద్దిపేట/(గజ్వేల్),
సెప్టెంబర్ 6 (వుదయం బ్యూరో)

కోటి ఎకరాల మగాణితో తెలంగాణను ధాన్య భాండాగారంగా మార్చిన అపర భగీరథుడు, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యవసాయ రంగాన్ని, సాగునీటి ప్రాజెక్టులను కాపాడుకోవడానికి మరో చారిత్రాత్మక ఉద్యమానికి పిలుపునిచ్చారు. KCR ఏం మాట్లాడినా అది కేవలం రాజకీయ ప్రకటన కాదు, తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు ఒక దిశానిర్దేశం. ప్రెస్ మీట్ పెట్టినా, సభ నిర్వహించినా ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాట తెలంగాణ శిరస్సు గర్వపడేలా ఉంటుందనడంలో సందేహం లేదు. ఆదివారం ఎర్రవెల్లి నివాసంలో జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో ఆయన చేసిన హెచ్చరికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.
లక్షలాది చూపులు.. మేధావి విశ్లేషణ!
తెలంగాణ ప్రాజెక్టులపై, నీటి పంపిణీపై కేసీఆర్ మాట్లాడే లెక్కర్లు, ఇచ్చే గణాంకాలు కేవలం విమర్శలు కావు; అవి ఒక విజన్, ఒక మేధో సముద్రం. కేసీఆర్ గొంతు విప్పితే చాలు.. వార్తా ఛానెళ్లలో, సోషల్ మీడియాలో కోట్లాది మంది రైతులు, ప్రజలు ఆసక్తిగా వీక్షించడమే ఆయనకున్న ప్రజాదరణకు నిదర్శనం. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తిరుగులేని సమాచారంతో ఆయన చేసే విశ్లేషణ ముందే ప్రత్యర్థులు సైతం నీళ్లు నమలాల్సిందే. కాళేశ్వరం ఉండి.. పాలమూరు పండబెట్టి.. రైతన్నకు గోస!కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వాడుకోవచ్చని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) స్పష్టం చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రాజెక్టులను ఎండబెడుతోందని కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 శాతం పనులు పూర్తయిన 'పాలమూరు రంగారెడ్డి' ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడం దారుణమన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలంలో నీళ్లు గలగలపారుతున్నా.. పంట పొలాలకు నీరివ్వకుండా రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు.అసెంబ్లీ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం వైఫల్యాలపై దండయాత్ర చేయాలని కేసీఆర్ ప్రజాప్రతినిధులకు ఆదేశించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, జీవో 97 చిక్కులు, 22A నిషేధిత భూముల సమస్యలు, విద్యుత్ కోతలు, ఫార్మాసిటీ రద్దు వంటి కీలక అంశాలపై శాసనసభను స్తంభింపజేసైనా సరే ప్రజా గొంతుకగా నిలవాలని దిశానిర్దేశం చేశారు.తెలంగాణ నీటి బొట్టు విలువ తెలిసిన నేతగా, వ్యవసాయానికి పెద్ద పీట వేసిన ప్రజా నాయకుడిగా కేసీఆర్ త్వరలోనే ప్రకటించబోయే భారీ కార్యాచరణపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. సభలు, సమావేశాలతో లక్షలాది మంది ప్రజలను సమాయత్తం చేస్తూ మరో తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా సాగునీటి పోరాటానికి సిద్ధమవుతుండటంతో..రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత రగిలే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఆచ్చ కాంగ్రెసు పోయి, పచ్చ కాంగ్రెస్ వచ్చి

* ఆరు గ్యారంటీల హామీని తుంగలో తొక్కింది
* మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

తెలకపల్లి,
సెప్టెంబరు 07 (వుదయం ప్రతినిధి)



అచ్చ కాంగ్రెస్ పోయి పచ్చ కాంగ్రెసు వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి భారీగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను వంచించి 0దని విమర్శించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్ వంటి పథకాలను గత ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో సమర్థవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. కానీ రేవంత్ రెడ్డి సర్కారు రైతులకు 24 గంటల కరెంటు లేకుండా, విత్తనాలను, ఎరువులను సక్రమంగా అందించకుండా, రుణమాఫీని చేయకుండా మోసం చేసింది న్నారు.రైతు ఏడ్చిన రాజ్యం,ఎద్దు ఏడ్చిన ఏవసం బాగుపడదని ఆయన హితువు పలికారు.ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి వంచించారని దుయబద్దారు. పోలీసులకు మాత్రం నెలకు జీతాలు అందిస్తూ, పోలీసుల అండతో ప్రభుత్వాన్ని నడిపించడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆద్యంతం ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి రైతులను, బి ఆర్ ఎస్ శ్రేణులను ఉత్తేజపరుస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆయన ప్రసంగం కొనసాగింది. ర్యాలీ అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా బి ఆర్ ఎస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ హనుమంతరావు,ఆ పార్టీ సీనియర్ నాయకులు బంగారయ్య, సుందర్ రెడ్డి రాములు,సత్యం,గోవర్ధన్ రెడ్డి, భగవాన్ రెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు, బి ఆర్ ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యల పట్ల మాట తప్పిన ప్రభుత్వం

*ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలి: సీఐటీయూ నేత పొదిల రామయ్య

నాగర్ కర్నూల్,
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):



ఆశ వర్కర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట తప్పిందని సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిల రామయ్య విమర్శించారు.సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని కోరుతూ డీఎం&హెచ్ఓ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు సమ్మె శిబిరాలకు వచ్చి ఫిక్స్ డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని అన్నారు. కనీస వేతనాలు అమలు చేశామని చెబుతున్న ప్రభుత్వం స్కీం వర్కర్లకు ఎక్కడ అమలు చేసిందని ప్రశ్నించారు. ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, ఎన్సీడీ ఆన్ లైన్ సర్వే, ఏఎన్ సీ టార్గెట్లు రద్దు చేయాలన్నారు. ఆశలకు 50 లక్షల ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులకు 50 వేలు, ప్రతి నెల 1వ తేదీన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, పండుగ సెలవులు, మెడికల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీలో ఫిక్స్ డ్ వేతనం అమలు చేస్తుంటే తెలంగాణలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, కళావతి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యమా?

అలంపూర్ సెప్టెంబర్ 07
(వుదయం కరస్పాండెంట్)



ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు హాజరయ్యేందుకు వెళ్లిన ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించి, దాడులు, దూషణలకు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్రంగా కలకలం రేపుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, మాణిక్‌రావు, విజయుడు పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల పట్లే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం.. పోలీసుల దురుసు ప్రవర్తనపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలపై నమోదైన కేసులను తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులపై దౌర్జన్యానికి తావులేదని, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

## న్యాయ విజ్ఞాన సదస్సుపై విద్యార్థులకు అవగాహన

నారాయణపేట టౌన్
సెప్టెంబర్ 7(వుదయం ప్రతినిధి)



న్యాయ విజ్ఞాన సదస్సుపై మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు నారాయణపేటలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ బాలుర విభాగం, సత్యనారాయణ దేవాలయం సమీపంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్ విద్యార్థులతో మాట్లాడుతూ మంచి స్పర్శ ఒక బిడ్డకు సురక్షితంగా, సౌకర్యవంతంగా, ప్రేమగా గౌరవంగా అనిపించేలా చేసే ప్రయత్నమే తల్లిదండ్రుల స్పర్శ అంటారు.తల్లిదండ్రులు కౌగిలించుకోవడం, తల్లిదండ్రులు సమక్షంలో డాక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహలు 18 ఏళ్లలోపు పిల్లలతో జరిగే ఏదైనా అధికారిక వివాహం లేదా అనధికారిక కలయికను యునిసెఫ్ బాల్య వివాహంగా నిర్వచిస్తుంది అన్నారు. విద్యార్థులకు సమాజంలో ఎదురవుతున్న సమస్యలను జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు డయల్ చేయండి లేదా అధికారిక జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఈ సంఘటనను నివేదించండి అని విద్యార్థులకు తెలిపారు. మీకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి విద్యార్థితో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ (24x7), 181 మహిళా హెల్ప్‌లైన్, 15100 ఎన్ ఎ ఎల్ ఎస్ ఏ ఉచిత న్యాయ సహాయం, 112 అత్యవసర సేవ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిదంగా మీ తల్లితండ్రులకు కచ్చితంగా తెలుపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అడ్వకేట్ క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్ పాల్గొన్నారు.

## అమ్రాబాద్‌లో భర్త దారుణ హత్య



అచ్చంపేట,
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లాఅమ్రాబాద్ మండలకేంద్రంలోదారుణహత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారంఅమ్రాబాద్ కు చెందిన మహమ్మద్ బురానోద్దీన్ ను అతని భార్య, ఇద్దరు కుమారులు కలిసి హత్య చేసి మృతదేహాన్ని పెట్టెలో కుక్కి ఇంట్లోనే దాచి ఉంచారు. తర్వాత ఆ పెట్టెను వేరే చోటికి తరలించేందుకు యత్నించారు. రోజులు గడవడంతో పెట్టె నుండి తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అంతలోపే భార్య, ఇద్దరు కుమారులు ఇంటి నుండి పరారయ్యారు.
సమాచారం అందుకున్న అమ్రాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పెట్టెను తెరిచి చూడగా అందులో పురుషుడి మృతదేహం కనిపించింది. వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమ్రాబాద్ ఎస్ ఐ హన్మంత్ రెడ్డి,సీఐ చంద్రయ్య తెలిపారు. సీఐ చంద్రయ్య ఆధ్వర్యంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలు, ఇతర ఆధారాలను సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## డ్రైవర్ జైపాల్‌కు వీడ్కోలు సన్మానం

కోహీర్
సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి )



కోహీర్ పోలీస్ స్టేషన్ నుండి సిద్దిపేటకు బదిలీపై వెళ్తున్న డ్రైవర్ జైపాల్‌కు ఎస్ఐ నరేష్ మరియు పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. కోహీర్ పిఎస్‌లో జైపాల్ అందించిన సేవలను, ఆయన విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ మరియు నిబద్ధతను ఎస్ఐ నరేష్ కొనియాడారు. అత్యవసర సమయాల్లో వాహనాన్ని సురక్షితంగా నడుపుతూ, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సిబ్బందికి అందించిన సహకారం మరువలేనిదని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తోటి పోలీస్ సిబ్బంది జైపాల్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకుంటూ, ఆయన ఆత్మీయ ప్రవర్తనను ప్రశంసించారు. ఆయన నూతన ఉద్యోగ బాధ్యతలు విజయవంతం కావాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జైపాల్ తనను ఆదరించిన ఎస్ఐ నరేష్‌కు, తోటి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడ్కోలు వేడుక అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగింది

## ప్రజావాణికి 17 ఫిర్యాదులు

* బాధితుల సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలి
* ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల సెప్టెంబర్ 07
(వుదయం కరస్పాండెంట్)



జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రజల నుంచి 17 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ.. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.
ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు ముఖ్యమని, సమస్యలకు ఆలస్యం లేకుండా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. భూ, ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు తదితర సమస్యలపై చట్టపరమైన పరిష్కారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల వివరాలు: భర్త వేధింపులు-1, గొడవలు-2, భూ వివాదాలు-2, కుటుంబ వివాదాలు-2, స్థలం ఆక్రమణ-1, ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతున్నారనే ఫిర్యాదు-1, సీడ్ పత్తి విత్తనాల డబ్బులు చెల్లించడంలేదనే ఫిర్యాదులు-3, ఇతర సమస్యలు-5 ఉన్నాయి.

## విద్యాసంస్థల్లో సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలి

* జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, సెప్టెంబర్ 07
(వుదయం కరస్పాండెంట్)




జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాలు, పాఠశాలలను సంబంధిత ప్రత్యేక అధికారులు తరచూ సందర్శించి, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు ప్రైవేట్ ఇంటర్నెట్‌ను వినియోగించకుండా టీఫైబర్ సేవలకు మారాలని ఆదేశించారు. సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన సమాచారాన్ని అన్ని గ్రామాల పరిధిలో సేకరించి అందజేయాలని అధికారులకు సూచించారు. వినాయక చవితి నేపథ్యంలో మండపాల వద్ద, విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని వినతి


మెదక్ జిల్లా వుదయం



నిజాంపేట మండలం కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు 13 డిక్లరేషన్ 6 గ్యారంటీ ల పేరుతో నమ్మించి అధికారంలోకి వచ్చిందని వంద రోజులలో ఇచ్చిన హామీలను నెరవేస్తామని చెప్పి1000 రోజులు పూర్తయిన ఇప్పటిదాకా ఒక హామీ పూర్తి చేయలేనందున హామీలను నెరవేర్చాలని కోరుతూ నిజాంపేట మండల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు 100 రోజులలో ఆరు గ్యారంటీలను పూర్తి చేస్తామన్న ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కళ్యాణ లక్ష్మి, 4000 పెన్షన్, మహిళా విద్యార్థులకు స్కూటీలు, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ అభివృద్ధి ఇస్తామని నేటికి నెరవేర్చని చెప్పి నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగరాజు, బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు బజార్ రంజిత్ గౌడ్ యూత్ అధ్యక్షులు మావురం రాజు,రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు,మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్,గౌస్, నాయకులు రెడ్డి శెట్టి రవీందర్,రాములు గౌడ్, నగేష్, లక్ష్మణ్, పున్న వెంకటస్వామి, మహేష్, రాజు నాయక్, నరేందర్ నాయక్, శివ కుమార్, తిరుమల్, సుభాష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజావాణికి 56 ఫిర్యాదులు

- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి – జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ
- రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు
- అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై
## ఆర్. కృష్ణయ్య ఆగ్రహం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- విద్యార్థులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి యత్నం.. ఆర్. కృష్ణయ్యను అడ్డుకున్న పోలీసులు



**ముషీరాబాద్ , సెప్టెంబర్ 07 (వుదయం)** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య విద్యార్థులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరారు. అయితే హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద పోలీసులు ఆయనను, విద్యార్థులను అడ్డుకున్నారు.

బీసీ విద్యార్థి సంఘం నాయకుడు నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులు హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి అసెంబ్లీ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నిలువరించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడటం సరికాదని అన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని విక్రయించే నిధులను పేద విద్యార్థుల విద్యాభవిష్యత్తుకు వినియోగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యను ప్రాధాన్యతగా తీసుకుని ఎలాంటి జాప్యం లేకుండా బకాయిలను చెల్లించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, యువత నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతయ్య,నికిల్ పటేల్ విద్యార్థులు పాల్గొన్నారు ..



## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా , సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 105 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు ఒక చీకటి రోజు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యం ప్రజాస్వామ్యానికి మచ్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం

**ముషీరాబాద్, సెప్టెంబర్ 07(వుదయం)** తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ బయట కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలను కాలరాసే విధంగా ఉందని విమర్శించారు. అధికార కాంగ్రెస్ వ్యవహారశైలి దుర్యోధన-దుశ్శాసన దుర్మార్గాలను తలపించేలా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు, పోలీసుల ద్వారా భౌతిక దాడులు చేయించారనే ఆరోపణలను నగేష్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తోందని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల టీషర్టులు ధరించి శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమని అన్నారు.ప్రత్యేకంగా నర్సాపూర్ మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగారనే ఆరోపణలు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల ఇలాంటి వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, మహిళల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని నగేష్ ముదిరాజ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు కిందపడేసి, తొక్కి, తీవ్రంగా గాయపరిచారని ఆయన ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానమని అన్నారు.



"ప్రశ్నించే గొంతును అణచివేయడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించలేరు. అధికార బలంతో ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు" అని నగేష్ ముదిరాజ్ హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రౌడీయిజం, నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

మహిళా ప్రజాప్రతినిధిపై జరిగిన ఘటనతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగినట్లు ఆరోపిస్తున్న భౌతిక దాడులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి బహిరంగ క్షమాపణ చెప్పాలని నగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

## ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి

- మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**దుండిగల్, సెప్టెంబర్ 7,(వుదయం ప్రతినిధి ),** ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించేందుకు నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకోవడాన్ని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను శాసనసభలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధం. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పై పోలీసులు దురుసుగా, అమానుషంగా ప్రవర్తించడం అత్యంత బాధాకరం అని ఈ ఘటనపై హైకోర్టు జోక్యం చేసుకుని ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా



పోలీసులు అడ్డుకోవద్దని, శాసనసభ వ్యవహారాల్లో స్పీకర్ అధికారాలే కీలకమని స్పష్టం చేయడం ప్రభుత్వ వైఖరికి చెంపపెట్టు లాంటిదనిఎమ్మెల్యేలు సభా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై చర్యలు తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసిందని, పోలీసులకు తమ పరిధిని దాటి ప్రజలచే ఎన్నికైన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం లేదని కోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలుఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని హైకోర్టు ఆదేశించడం ఈ ఘటన తీవ్రతను తెలియజేస్తోందని తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కూడా డీజీపీని కోర్టు ఆదేశించిందని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను తక్షణమే మానుకోవాలని, ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తే ప్రజాప్రతినిధుల హక్కులను గౌరవించాలనిమహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని కాలరాయడం సరికాదని. ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాల

## షాద్‌నగర్‌లో దశ 10 - ది ఫుడ్ పార్క్ ప్రారంభం

- మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి శుభాకాంక్షలు

**షాద్‌నగర్ , సెప్టెంబర్ 07(వుదయం)** షాద్‌నగర్‌లో దశ 10 ది ఫుడ్ పార్క్ విజయవంతంగా ప్రారంభం కావడం పట్ల మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

దశ 10 ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మరియు మిత్రులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫుడ్ పార్క్ విజయవంతంగా కొనసాగుతూ షాద్‌నగర్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆహారం, మంచి సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.




ఇలాంటి నూతన వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు షాద్‌నగర్ అభివృద్ధికి దోహదపడతాయని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు. దశ 10 ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మరియు మిత్రులకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో పాఠశాల నిర్మాణం పేరుతో జేసీబీలతో చదును

- మంజూరు పత్రాలు లేకుండా పనులు ఎలా చేపడుతున్నారు?
- మొయినాబాద్ తహసీల్దార్ విచారణ చేపట్టాలి: భానూరి శివశంకర్ గౌడ్

**చేవెళ్ల సెప్టెంబర్ 7 (వుదయం)** మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట గ్రామంలోని సర్వే నంబర్లు 92, 103, 104 పార్ట్‌లలో ఉన్న సుమారు 32 ఎకరాల ప్రభుత్వ భూమిలో పాఠశాల నిర్మాణం కోసం స్థలం కేటాయించారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం జేసీబీలతో భూమిని చదును చేస్తున్న వ్యవహారంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ భూమిలో పాఠశాల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి మంజూరు పత్రాలు లేదా



సాంక్షన్ లెటర్ గ్రామ పంచాయతీ దృష్టికి రాలేదని గ్రామ కార్యదర్శి తెలిపినట్లు టీపీసీసీ-ఐఎన్టీయూసీ లేబర్ సెల్ చేవెళ్ల నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు.గ్రామాల్లో చిన్న సీసీ రోడ్ల నిర్మాణానికి సైతం శిలాఫలకాలు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని, అలాంటిది ఇంత పెద్ద ప్రాజెక్టు విషయంలో ఎలాంటి శంకుస్థాపన లేకుండా, స్థానిక అధికారులకు సమాచారం లేకుండా పనులు ఎలా జరుగుతున్నాయో అర్థం కావడం లేదని ఆయన అన్నారు.ప్రభుత్వమే పాఠశాల నిర్మాణానికి భూమిని కేటాయించి, పనులకు అనుమతి ఇచ్చి ఉంటే, సంబంధిత మంజూరు పత్రాల కాపీని తోలుకట్ట గ్రామ పంచాయతీ కార్యాలయానికి అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనులు అధికారికంగానే జరుగుతున్నాయా, లేక ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారా అనే అంశంపై మొయినాబాద్ తహసీల్దార్ స్వయంగా స్థలాన్ని పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని భానూరి శివశంకర్ గౌడ్ కోరారు.

## ఘనంగా శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**జిన్నారం 7 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)** బొల్లారం డివిజన్ పరిధిలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిన్నారం పటాన్చెరువు మండలాల విద్యాధికారులు విజయ్ కుమార్ నాగేశ్వర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉదయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే మార్గదర్శి అని ముఖ్య అతిథులు కొనియాడారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉన్నత శిఖరాల వైపు నడిపించే మహోన్నత వ్యక్తి




గురువు అని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాధికారులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు హరికృష్ణ రెడ్డి, ప్రభు కుమార్, సింహాచలం, కిషోర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలకు పోలీసుల భద్రతా మార్గదర్శకాలు జారీ

- మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి : సి.ఐ రుద్వీర్ కుమార్
- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవ కమిటీలకు స్పష్టమైన సూచనలు
- నిమజ్జన ఊరేగింపుల్లో అప్రమత్తత అవసరం. . పోలీసుల సూచనలు
- .నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. . అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

**శంకర్ పల్లి సెప్టెంబర్ 07 (వుదయం)** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శంకర్ పల్లి పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలకు పలు భద్రతా మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి సి.ఐ రుద్వీర్ కుమార్ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ప్రతి అంశంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల నుంచి అవసరమైన ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాతే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలను పాటిస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు.మండపాల ఏర్పాటులో నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సి.ఐ రుద్వీర్ కుమార్ సూచించారు. ప్రతి మండపానికి ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి వారి వివరాలను, గుర్తింపు కార్డుల ప్రతులను సంబంధిత అధికారులకు సమర్పించాలని తెలిపారు. ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రధాన రహదారులు, కూడళ్లపై మండపాలను ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్‌ను నాణ్యమైన సామగ్రితో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మండపాల వద్ద ఇసుక బకెట్లు, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు . నిమజ్జనానికి వినియోగించే వాహనాలు ఫిట్‌నెస్ కలిగి ఉండటంతో పాటు లైసెన్స్ ఉన్న డ్రైవర్లనే వినియోగించాలని సూచించారు. వాహనాలపై పరిమితికి మించి వ్యక్తులు ఎక్కకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన సమయంలో పిల్లలు . ఊరేగింపులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని ఉత్సవ కమిటీలకు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తి చేసేందుకు నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సి.ఐ రుద్వీర్ కుమార్ పేర్కొన్నారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సి.ఐ రుద్వీర్ కుమార్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు



తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలు , మండపాలు, ప్రధాన రహదారులు, నిమజ్జన మార్గాల్లో పరిస్థితులను పోలీసులు పర్యవేక్షిస్తారని చెప్పారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, సి.ఐ రుద్వీర్ కుమార్, ఎస్.ఐలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారంతో నిర్వహించాలని అధికారులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు కోరారు.

**IN THE COURT OF THE HON'BLE IV ADDL.JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT :L.B.NAGAR**
**O.S.No. 657 of 2026**

**Between:**
Smt.Vimala Ramakrishna and Others
**...Plaintiff**
**AND**
1. The Tahasildar, Saroornagar Mandal
2. All Concerned
**…Defendants**

To
**D-2 ALL CONCERNED**
Take notice that the Plaintiffs filed the above Suit for Declaration declaringthePlaintiffs are the Legal Heirs and Successors of Late Valaja Ramakrihna@Ramakrishna Venugopal, S/o. Late V.Venu Gopal was died on 09-10-2018andthe suit is stands posted to 21/09/2026. If any person or persons havinganyObjections or Claims they may appear before the above Court on 21/09/2026at 10.30 a.m. either in person or through an Advocate, failing whichthematterwill be decided basing on the documents available on record.

*(By Order Of the Court)*
**Sd/-**
**M/s.K.Raja Reddy, A.V.Sujith Kumar, Advocates, Hyd. Counsel for the Plaintiffs**

**IN THE COURT OF THE HON'BLE II ADDITONAL JUNIOR CIVIL JUDGE:AT: RAJENDRANAGAR**
**O.S.No. 358 of 2026**

**Between:**
Sri. Amit Mathur
**...Plaintiff**
**AND**
1. Smt. Ruchi Mathur
2. The Tahsildar/ Mandal Revenue Officer, Gandipet, Rangareddy District.
3. All Concerned
**...Defendants No. 1 to 3**

To
All Concerned
**PUBLIC NOTICE**
**Defendant.No.3**
**ALL CONCERNED**
The General Public is hereby informed that the above-named Plaintiff have filed a Suit for Declaration of Legal Heir of deceased Late Mahesh B. Mathur and Late Indira Mathur against the Defendants. In which the Hon'ble Court has directed to serve the notice on **Defendant.No.3** for the purpose of your appearance. Please take notice that the above suit stands posted to **15-09-2026** for **your appearance**, any person having objections in the above said matter is hereby directed to appear before the said Hon'ble Court either in person or through an Advocate on **15-09-2026 at 10:30 A.M.,** failing which the matter will be heard and decided **Ex-parte.**

*(By Order Of the Court)*
**Sd/-**
**M. SAI KEERTHAN ADVOCATE**
**Office at # Flat No.208, H.No.10-2-287/1/A, Urimila Prabhakar Reddy Residency, Shanti Nagar, Masab Tank, Hyderabad.**

**IN THE COURT OF THE HONORABLE XII ADDL CHIEF JUDGE. AT: SECUNDERABAD**
**O.P.NO 120 of 2024.**

**Between:**
M.Babitha & Anr.
**...Petitioners.**
**AND**
Md. Zubair Qureshi & Others.
**...Respondents.**

TO, -R1.
Md. Zubair Qureshi, S/O:Md. Raheem Qureshi, Aged: Major, Occ: Driver,R/O: H.NO-2-3-658/2, Azad Nagar, Amberpet, Hyderabad. T.S. 500013.
Please take notice that the above Petitioners have filed the above O.P 120 of 2024 for the death of M.Ravinder @Ravinder Kumar, in R.T.A. against you and other Respondents. The above case is posted on **17-09-2026**, for your appearance at about 10-30 A.M before the above said court. Hence you are hereby called upon to appear before the above said court on the above said time personally or through your counsel. If you are failed to appear the ,'matter will be decided in your absence.

*(By Order Of the Court)*
**Sd/-**
**Sri. K.Chandrashekar, Advocate Secunderabad. Ph- 9290997676.**




## మాట్లాడే ప్రతీ మాటను చూస్తున్నాం

"కొందరు మాట్లాడేటప్పుడు ద్వంద్వార్థం వచ్చే పదాలను ఉపయోగిస్తున్నారు. దాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. మనందరి ఇళ్లలోనూ తల్లి, అక్కా చెల్లెళ్లు ఉన్నారు. మహిళలను అవమానించేలా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకు పోతుంది..దీన్ని రాజకీయకోణంలో చూడొద్దు. ఇదే అసెంబ్లీలో జయలలిత ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నారో మనమంతా చూశాం. ప్రతి ఒక్కరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది. కాకపోతే మనం మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తుంటారని గుర్తుంచుకోవాలి."

సీ.జోసెఫ్ విజయ్, తమిళనాడు సీఎం

## వేమన పద్యం

కల్లలాడువాని గ్రామకర్త యరుగు
సత్యమాడువాని స్వామి యరుగు
బెక్కుతిండపోతు(బెండ్లా మెరుంగురా
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# పెద్దోళ్లకు ఒకలా.. పేదోళ్లకు మరోలా...

ఒక రైతు లక్ష రూపాయల అప్పు తీసుకుని పంట దెబ్బతినడంతో తీర్చలేకపోతే బ్యాంకు తలుపు తడుతుంది. వడ్డీ మీద వడ్డీ పెరుగుతుంది. చివరకు ఆస్తులు వేలం వేసే పరిస్థితి వస్తుంది. సామాన్యుడు ఈఎంఐ ఒక్కసారి కట్టకపోయినా నోటీసు అందుతుంది. చిన్న వ్యాపారి కొద్దిపాటి బకాయిపడినా బ్యాంకు అతని వెంట పడుతుంది. కానీ, వేల కోట్ల కార్పొరేట్ రుణాల దగరకు వచ్చేసరికి ఆ కథ మరోలా ఉంటుంది. అప్పు తీసుకున్నవాడు ఎంత పెద్దవాడైతే అప్పు భారం అంత చిన్నదై పోతుంది. జీ, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా కేసులో ఇప్పుడదే చర్చకు దారితీసింది. వేల కోట్ల రూపాయల క్లెయిమ్‌లకు ఐదారు కోట్లతో ఎన్‌సిఎల్‌టి పరిష్కార ప్రణాళిక ఆమోదించడం దేశాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, రుణదాతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమ వడంతో సెప్టెంబర్ ఒకటిన బెంచ్ మళ్లీ విచారణకు ఆదేశించింది. కానీ, ఈ దివాళా ప్రక్రియ కార్పొరేట్ల దోపిడీ స్వభావాన్ని బహిర్గత పరిచింది. సుభాష్ చంద్ర ఒకప్పుడు దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఒకరు. ఆయన వ్యక్తిగత దివాళా అలా ఆయనపై అంగీ కరించిన రుణదాతల క్లెయిమ్‌లు రూ.22, 006.57 కోట్లకు చేరాయి. ఇక్కడే జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వ్యవహారం ముందుకొస్తుంది. ఇది కంపెనీల దివాలా, రుణ పరిష్కారం వంటి అంశాలను చట్ట ప్రకారం పరిశీలించే ప్రత్యేక న్యాయ సంస్థ. కేంద్ర ప్రభ త్వం ఏర్పాటు చేసినదే. అది సుభాష్ చంద్ర తరఫున రూ.6.25 కోట్లతో పరిష్కార ప్రణాళిక ఇచ్చింది. . ఆ సంస్థకు రూ.1,322.39 కోట్ల క్లెయిమ్ ఉండగా, మొదట ఆమోదం పొందిన ప్రణాళికలో కేవలం రూ.38.09 లక్షలు మాత్రమే ప్రతిపాదించింది. ప్రభుత్వరంగ బ్యాంకుల డబ్బు కూడా ప్రజల ఆర్థిక వ్యవస్థలో భాగమే కదా. ఆ భారం ఎల్ఐసి మూలధనం మీద ప్రభావం చూపుతుంది. ఆ భారం ఇప్పుడు ఎవరు మోయాలన్నది ప్రశ్న. సుభాష్ చంద్ర కేసు ఒక్కటే కాదు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వంటి భారీ రుణ, ఆర్థిక అవకతవకల కేసుల్లో నిందితులు దేశం విడిచి వెళ్లిన ఉదాహరణలనేకం. 2014 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు బ్యాంకులు రూ.16.61 లక్షల కోట్ల రుణాలను రైట్‌ఆఫ్ చేశాయి. కానీ, ఇంత భారీ మొత్తంలో వసూళ్లు ఎందుకు తక్కువగా ఉన్నాయన్నది మాత్రం ప్రశ్నించాల్సిందే. ఎన్‌సీఎల్‌టీ ద్వారా ప్రక్రియ సాగినా ప్రభుత్వానికి బాధ్యత లేదని అనుకోలేం. దివాలా చట్టాన్ని రూపొందించింది పార్లమెంటే. ఎన్‌సీఎల్‌టీని ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వమే. ప్రభుత్వ రంగ బ్యాంకుల విధానాలు, భారీ కార్పొరేట్ రుణాల మంజూరు, మొండి బకాయిల వసూళ్లపై కేంద్రానికి విధాన పరమైన బాధ్యత ఉంది.

భారీ రుణాలు ఎలా మంజూరయ్యాయి? సరైన హామీలు ఉన్నాయా? ఉద్దేశపూర్వక ఎగవేత జరిగిందా? ఆస్తులు ఎక్కడున్నాయన్నది తేలాలి. ఈ పరిణామాలన్నింటిని చూస్తే దొడ్డిదారిన 'డబ్బులెగ్గొట్టే పరిష్కారం' ప్రభుత్వ,కార్పొరేట్ మైత్రిని బలపరుస్తోంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# కళారంగ ఘనాపాఠి గరికపాటి



కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్ఫూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కర దీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజా వైద్యుడు రాజారావు.నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక సైనికుడిలా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే.గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963)

తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభా వంతమైన కళాకారులు పరిచమయ్యారు. చెప్పికోదగిన వారిలో దేవిక, అల్లు రామ లింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు.

రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామ లింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణ దాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువు కుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకం లోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరాబాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు.

మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు.మద్రాసలో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాల నిర్వహించారు.రాజారావు 1953లో పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశారు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించ లేదు. దానితో రాజారావు ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. ఒక్క రూపాయికి వైద్యం చేసిన సేవా తత్పరులు. పేద వారికి ఉచితం వైద్యం చేస్తుండేవారు.ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నాచితక పాత్రలు కూడా పోషించారు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశారు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాలవల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.



రామ కిష్టయ్య
సంగన భట్ల
.9440595494

# ఆందోళనకరంగా మేధో వలస

ఒక దేశ సంపదను కేవలం దాని భూగర్భంలో దాగి ఉన్న సహజ వనరులతో కొలవలేం. ఆ దేశానికి ఉన్న అసలైన సాంస్కృతిక, ఆర్థిక నిధి మానవ మేధస్సు. శాస్త్రవేత్త, వైద్యుడు, ఇంజినీర్, పరిశోధకుడు, సాంకేతిక నిపుణుడు——వీరి జ్ఞాన తృష్ణ, ఆవిష్కరణ సామర్థ్యమే ఆధునిక ఆర్థిక వ్యవస్థను నడిపించే అసలు ఇంధనం. అలాంటి ప్రతిభావంతులు ఉజ్జ్వల భవిష్యత్తు కోసం విదేశాలకు తరలిపోతున్నప్పుడు 'మేధో వలస'పై ఆందోళన వ్యక్తమవ్వడం సహజం. అయితే, దీనిని కేవలం ఒక నష్టంగా మాత్రమే భావించడం వాస్తవాన్ని పూర్తిగా అర్థం చేసుకోకపోవడమే అవుతుంది.

భారతదేశం తన ప్రతిభను కోల్పోతుందా? లేక ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన తన ప్రాతిభాగ్రామాన్ని తిరిగి దేశ వికాసానికి వాడుకోగలదా? ఈ రెండు ప్రశ్నల నడుమే అసలైన మేధో మథనం జరగాలి. అంతర్జాతీయ విద్య వైపు భారతీయ విద్యార్థుల్లో పెరుగుతున్న ఆకర్షణ ఈ మార్పుకు స్పష్టమైన సూచిక. 2021–22లో సుమారు 11.59 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్లగా, 2024 నాటికి ఆ సంఖ్య 13.36 లక్షలకు చేరుకుంది. స్వదేశంలో చదువుతున్న విదేశీ విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఈ వ్యత్యాసం చాలా తీవ్రమైనది. కానీ, విదేశీ ప్రయాణాన్ని కేవలం శాశ్వత నిష్క్రమణగా పరిగణించలేం. విదేశాల్లో అర్జించిన జ్ఞానంతో స్వదేశంలో నూతన సంస్థల స్థాపన, పెట్టుబడులు, సంయుక్త పరిశోధనలు సాధించే అవకాశాలు అపారం. కాబట్టి, సమస్య ప్రతిభ విదేశాలకు వెళ్లడంలో లేదు; ఆ మేధస్సుకు దేశంతో ఉన్న అనుబంధం తెగిపోవడంలోనే ఉంది.

ఈ మేధో వలసకు అనేక కారణాలు ఉన్నాయి. నాణ్యమైన ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల కొరత, మెరిట్‌కు తగిన అవకాశాలు లభించకపోవడం, ప్రభుత్వ విభాగాలు, పరిశోధనా సంస్థల్లో పెరిగిన అధికారిక జోక్యంతో కూడిన వాతావరణం నిపుణులను నిరాశకు గురిచేస్తున్నాయి. దీనికి తోడు మెరుగైన జీవన ప్రమాణాలు, సామాజిక భద్రత, అధిక వేతనాలు విదేశాల వైపు ఆకర్షిస్తున్నాయి. మన దేశంలో పరిశోధన–అభివృద్ధి వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 0.7 శాతానికే పరిమితం కావడం ఈ సవాలును మరింత తీవ్రతరం చేస్తోంది. దీనివల్ల పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో నాణ్యమైన విద్యను పొందిన నిపుణులు విదేశీ పురోగతికి ఉపయోగపడుతుంటే, స్వదేశంలో మాత్రం మేధో శూన్యత ఏర్పడుతోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, జీవసాంకేతికత, రక్షణ వంటి వ్యూహాత్మక రంగాల్లో నిపుణులు తగ్గడం జాతీయ భద్రతకే కాక భవిష్యత్ ఆవిష్కరణల సామర్థ్యానికి తీవ్ర విఘాతం



కలిగిస్తోంది.

ఈ ప్రతికూల ప్రభావం కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా సామాజిక స్థాయిలోనూ విస్తరిస్తోంది. అగ్రశ్రేణి వైద్యులు, అధ్యాపకులు, పరిశోధకులు దేశం విడిచి వెళ్లడం వల్ల మన విద్యాబోధన, ఆరోగ్య రక్షణ వ్యవస్థలు నాణ్యతా లోపంతో ఇబ్బంది పడుతున్నాయి. దేశంలో తగినంత స్టార్టప్ ఆవిష్కరణల ప్రతిభ ఉన్నప్పటికీ, మేధో హక్కులు, పేటెంట్లు వేరే దేశాల ఖాతాల్లోకి వెళ్లిపోవడం వల్ల మన సామర్థ్యానికి తగిన ఆర్థిక ప్రయోజనాలు లభించడం లేదు. ఉపాధి సృష్టికర్తలుగా మారాల్సిన యువకులు విదేశాల్లో ఉద్యోగులుగా ఉండిపోవడం వల్ల దేశంలో ఉద్యోగాల సృష్టి మందగిస్తోంది. అంతేకాకుండా స్వదేశంలో లభించని గుర్తింపు, ఆవిష్కరణల స్వేచ్ఛ విదేశాల్లో లభిస్తోందనే భావన నూతన ప్రతిభావంతుల్లో తీవ్రమైన ఆత్మవిశ్వాస లోపానికి కారణమవుతోంది.

ఈ నేపథ్యంలో, మేధో వలసను ఎలా నిరోధించాలి? అనే సంకుచిత ప్రశ్న స్థానంలో, మేధో చలనాన్ని భారత్ సమగ్ర వికాసానికి ఎలా అనుసంధానించాలి? అనే విశాల దృక్పథం రావాలి. విదేశాల్లోని ప్రవాస భారతీయులు పంపే నిధులు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, వ్యాపార భాగస్వామ్యాలు భారతదేశానికి ప్రపంచ స్థాయి వారధిగా తోడ్పడతాయి.

> భారతదేశం తన ప్రతిభను కోల్పోతుందా? లేక ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన తన ప్రాతిభాగ్రామాన్ని తిరిగి దేశ వికాసానికి వాడుకోగలదా? ఈ రెండు ప్రశ్నల నడుమే అసలైన మేధో మథనం జరగాలి. అంతర్జాతీయ విద్య వైపు భారతీయ విద్యార్థుల్లో పెరుగుతున్న ఆకర్షణ ఈ మార్పుకు స్పష్టమైన సూచిక. 2021–22లో సుమారు 11.59 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్లగా, 2024 నాటికి ఆ సంఖ్య 13.36 లక్షలకు చేరుకుంది. స్వదేశంలో చదువుతున్న విదేశీ విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఈ వ్యత్యాసం చాలా తీవ్రమైనది.

దీనికి స్పందించాల్సింది నిరోధక విధానాలతో కాదు; ప్రపంచ స్థాయి పరిశోధనా వాతావరణాన్ని సృష్టించడంతోనే! ఆవిష్కరణలకు స్వేచ్ఛ, శ్రమకు తగిన గుర్తింపు, పరిశ్రమ–విశ్వవిద్యాలయాల మధ్య సమర్థవంతమైన అనుసంధానం ఏర్పడాలి. విదేశాల్లో ఉన్న భారతీయ శాస్త్రవేత్తలకు సంయుక్త పరిశోధనలు, స్వల్పకాలిక అధ్యయన బాధ్యతలు కల్పిస్తూ ఆత్మీయంగా ఆహ్వానించాలి.

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన భారత్‌కు ఈ మానవ వనరులే మహోన్నత శక్తి. విదేశీ ఉద్యోగమే విజయానికి ఏకైక ప్రామాణికమనే భావనను మార్చి, స్వదేశంలోనే ప్రతిభకు పీఠం వేసే సంస్కృతి వికసించాలి. మేధస్సును నియంత్రించడం కాదు——ప్రోత్సహించాలి; వలసను ఆపడం కాదు——అనుబంధాన్ని పెంచాలి; ప్రతిభను కోల్పోవడం కాదు——దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలి. అప్పుడే 'మేధో వలస' అనే సవాలు, 'మేధో శక్తి' అనే జాతీయ విప్లవంగా రూపాంతరం చెంది, భారతదేశాన్ని ప్రపంచ జ్ఞాన నాయకత్వ పీఠంపై నిలబెడుతుంది.



హెచ్.ప్రతాప్
బాచిలర్స్ ఇన్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్( ఉస్మానియా)

## పూల రేకులు

వెలుగులో ఉన్నప్పుడు
అందరూ
చుట్టూ వస్తారు
నీ చుట్టూ చేరి
ఉత్సవాలు చేస్తారు
ఆ వెలుగంతా
నీదేనని
నిన్నొక విగ్రహాన్ని చేస్తారు



పూల రేకులు
పన్నీటి జల్లులు కురిపిస్తారు
నీ చుట్టూపరిమళాలు వీస్తున్నాయని
నిన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తారు
నీ పూల రేకులును
దొంగిలిస్తారు
నీ సంతకాన్నిచెరిపేస్తారు
నీ చూపు కోసం
పరితపించిన వారు
నీ చుట్టూపరిభ్రమించిన వారు
ఒక్కొక్కరునీ దాపు నుండి
నీ మాటల తీగలను
తెంపుకుని తప్పుకుంటారు
ఎక్కడెక్కడి మబ్బులు చేరి
నిన్ను కమ్ముకున్న వేళ
నిన్ను ఒంటరిని చేసి
చీకటి రోదనలో
నిన్ను బందీని చేసి
మరో వెలుతురుకు
తోసుకుని వెళతారు

# సమాజాన్ని చదవడమే అసలైన విద్య

అక్షరాస్యత గురించి మాట్లాడినప్పుడల్లా సాధారణంగా చదవడం, రాయడం తెలియని వారి సంఖ్య గురించే చర్చ జరుగుతుంది. ప్రభుత్వాలు అక్షరాస్యత శాతాలను ప్రకటిస్తాయి. పాఠశాలల్లో చేరికలు పెరిగాయని, విద్యావకాశాలు విస్తరించాయని నివేదికలు వెల్లడిస్తాయి. ఇవన్నీ ఒక సమాజం విద్యా ప్రగతిని అంచనా వేయడానికి అవసరమైన సూచికలే అయినప్పటికీ, అక్షరాస్యతను కేవలం ఈ పరిమిత అర్థంలోనే చూస్తే నేటి సమాజంలోని అసలు సమస్యను పూర్తిగా అర్థం చేసుకోలేం.చదవగలిగే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా విమర్శనాత్మకంగా ఆలోచిస్తాడని చెప్పలేం. ఉన్నత విద్యను అభ్యసించినంత మాత్రాన సమాజాన్ని నిష్పాక్షికంగా అర్థం చేసుకుంటాడని కూడా చెప్పలేం. సమాచార విస్ఫోటనం జరుగుతున్న ఈ కాలంలో సమాచారం అందుబాటులో ఉండటం ఒక విషయమైతే, అందులోని నిజానిజాలను విశ్లేషించే సామర్థ్యం ఉండటం మరో ముఖ్యమైన అంశం. అందుకే నేటి అక్షరాస్యత చర్చను ఒక కొత్త కోణంలో చూడాల్సిన అవసరం ఏర్పడింది.

**అక్షరాలు దాటి అసలు సవాలు**

గతంతో పోలిస్తే విద్యాసంస్థల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విస్తరణతో పాటు డిజిటల్ సాంకేతికత విద్యను, సమాచారాన్ని గతంలో ఎన్నడూ లేని స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒకప్పుడు గ్రంథాలయాల్లో మాత్రమే లభించిన సమాచారం ఇప్పుడు మొబైల్ ఫోన్ ద్వారా కొన్ని క్షణాల్లోనే మన చేతికి అందుతోంది.అయితే ఈ విస్తరణతో పాటు ఒక వైరుధ్యం కూడా సమాజంలో కనిపిస్తోంది. సమాచారం పెరుగుతున్న కొద్దీ అపోహలు, తప్పుడు సమాచారం, వక్రీకరించిన వాస్తవాలు, అసత్య ప్రచారాలు కూడా అదే వేగంతో వ్యాప్తి చెందుతున్నాయి. చదువుకున్న వారిపై కూడా వదంతులు, నిర్ధారణ లేని వార్తలు, ద్వేషపూరిత భావజాలం ప్రభావం చూపుతుండటం గమనార్హం.ఇది మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేస్తోంది. నిజమైన అక్షరాస్యత అంటే లభ్యమయ్యే సమాచారాన్ని కేవలం చదవగలగడం మాత్రమే కాదు; ఆ సమాచారాన్ని పరిశీలించడం, ప్రశ్నించడం, దాని మూలాలను సరి చూసుకోవడం, ఆధారాలను అంచనా వేయడం కూడా. సమాచార విస్తృతి ఎంతుంది అనేకంటే, దానిద్వారా మనిషి ఏం చేస్తున్నాడన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

**విద్య.. ఉపాధిని దాటి**

నేటి విద్యావ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, పరీక్షా ఫలితాలు, ఉద్యోగావకాశాలకు సహజంగానే అధిక ప్రాధాన్యం ఉంది. విద్య ఒక వ్యక్తికి ఉపాధిని అందించి ఆర్థిక స్వావలంబనకు దారి చూపాలి. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే విద్య లక్ష్యం అక్కడితో ముగిసిపోతే దాని విస్తృతమైన సామాజిక ప్రయోజనం వెనుకబడిపోతుంది.విద్య మనిషిని తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకునే వ్యక్తిగా తీర్చిదిద్దాలి. విభిన్న అభిప్రాయాలను వినగలిగే సహనాన్ని, మంచీ చెడులను వివేచించే శక్తిని, అన్యాయాన్ని గుర్తించే సామాజిక స్పృహను పెంపొందించాలి. తనకు నచ్చిన సమాధానాన్ని మాత్రమే వెతకకుండా, అసౌకర్యం కలిగించే ప్రశ్నలను కూడా ఎదుర్కొనే ఆలోచనా ధైర్యాన్ని ఇవ్వాలి.కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో విద్య సంపూర్ణం కాదు. ప్రశ్నించే నైపుణ్యం, భిన్నమైన అభిప్రాయాన్ని గౌరవించే సంస్కారం, తర్కబద్ధంగా ఆలోచించే అలవాటు, సమాజంలోని సమస్యల పట్ల బాధ్యతాయుతమైన స్పందన లేనప్పుడు ఆ విద్య తన విస్తృతమైన లక్ష్యాన్ని పూర్తిగా నెరవేర్చినట్లు కాదు.డిజిటల్ ప్రపంచంలో విచక్షణనేటి ఆధునిక ప్రపంచంలో ఒక కొత్త రకమైన నిరక్షరాస్యత మన ముందుకు వస్తోంది. న్న ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మడం ప్రమాదకరం. ఒక వార్తను చదివిన వెంటనే నమ్మడం ఎంత సులభమో, దాన్ని పంచుకునే ముందు ఒకసారి ఆలోచించడం అంతే అవసరం.ఇక్కడ అసలు సమస్య సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం కాదు; దాన్ని వివేకంతో ఎలా ఉపయోగించాలో తెలియకపోవడమే. స్మార్ట్‌ఫోన్‌ను సులువుగా వాడగలగడం డిజిటల్ అక్షరాస్యతకు పూర్తి ప్రమాణం కాజాలదు. సమాచార మూలాన్ని సరిచూసుకోవడం, ఒకే విషయాన్ని విశ్వసనీయమైన ఇతర వనరులతో పోల్చడం, తేదీ – సందర్భాలను గమనించడం, భావోద్వేగాలను రెచ్చగొట్టే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండటం డిజిటల్ అక్షరాస్యతలో కీలకమైన భాగాలు.UNESCO కూడా మీడియా, సమాచార అక్షరాస్యతను 21వ శతాబ్దపు కీలక సామర్థ్యంగా గుర్తిస్తూ, తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రసంగం, డిజిటల్ సాంకేతికతల ప్రభావం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచన, సమాచారాన్ని మూల్యాంకనం చేసే సామర్థ్యం, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన పెంపొందించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజాస్వామ్యానికి కావాల్సిన చైతన్యంఅక్షరాస్యతకు ప్రజాస్వామ్య బలానికి మధ్య ఉన్న సంబంధం చాలా లోతైనది. తన హక్కులు, బాధ్యతల పట్ల స్పష్టత లేని పౌరుడు ప్రజాస్వామ్య వ్యవస్థలో సమర్థవంతంగా భాగస్వామి కాలేడు. సరైన సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం బలహీనపడినప్పుడు ప్రజాభిప్రాయం సులభంగా ప్రచారాల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంటుంది.ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికల ప్రక్రియతో ముగిసేది కాదు. అది ప్రశ్నించే పౌర సమాజంపై, స్వేచ్ఛాయుతమైన సమాచారంపై, విభిన్న అభిప్రాయాలను సహించే సంస్కృతిపై ఆధారపడి ఉంటుంది. అధికారాన్ని ప్రశ్నించడం, నిర్ణయాలను పరిశీలించడం, తన హక్కులతో పాటు ఇతరుల హక్కులను గౌరవించడం ప్రజాస్వామ్య పౌరసత్వంలో అంతర్భాగాలు.అందుకే ఒక దేశం కేవలం అక్షరాస్యత శాతాన్ని పెంచుకోవడం మాత్రమే కాకుండా, ఆ విద్య సమాజంలో ఎలాంటి ఆలోచనా సంస్కృతిని నిర్మిస్తోందనే అంశాన్ని కూడా పరిశీలించాలి. ప్రజలు సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారా? భిన్నాభిప్రాయాన్ని శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య సహజ లక్షణంగా చూస్తున్నారా? తప్పుడు ప్రచారాన్ని ప్రశ్నించే సామర్థ్యం పెరుగుతోందా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు కూడా విద్యా ప్రగతికి కొలమానాలుగా మారాలి.

**అక్షరాస్యతకు విస్తృత అర్థం**

ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో అక్షరాస్యత భావనను పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది. భాషను చదవడం, రాయడం అనేది మొదటి ప్రాథమిక మెట్టు మాత్రమే. దానిని దాటి సమాచారాన్ని విశ్లేషించే వివేకం, . ఒక వార్తను చదవడం ఒక సామర్థ్యం అయితే, దాని వెనుక ఉన్న ఆధారాలను పరిశీలించడం, సందర్భాన్ని అర్థం చేసుకోవడం, అందులోని పక్షపాతాన్ని గుర్తించడం మరింత ఉన్నతమైన సామర్థ్యం.అదే విధంగా ఒక సామాజిక సమస్యను చూడటం ఒక విషయం; వాస్తవాలు, తర్కం ఆధారంగా సమీక్షించుకోగలగడం మరింత ముఖ్యమైన చైతన్యం. ఈ దృష్టిలో అక్షరాస్యత వ్యక్తిగత నైపుణ్యాన్ని దాటి సామాజిక బాధ్యతగా మారుతుంది.

**అక్షరాల నుంచి చైతన్యం వరకు**

సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని జరుపుకునే సందర్భంలో మనం ఒక ప్రాథమిక ప్రశ్న వేసుకోవాలి. మనం కేవలం అక్షరాలను చదివే తరాన్ని తయారుచేస్తున్నామా? లేక ఈ ప్రపంచాన్ని సునిశితంగా అర్థం చేసుకుని, ప్రశ్నించి, బాధ్యతగా స్పందించే చైతన్యవంతమైన పౌరులను తీర్చిదిద్దుతున్నామా?2026లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం 60వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ ఏడాది UNESCO ప్రకటించిన థీమ్ 'Literacy for people, the planet and prosperity'. మారుతున్న ప్రపంచంలో అక్షరాస్యత సాధించిన పురోగతిని సమీక్షించడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో పెట్టుకుని అక్షరాస్యతపై కొత్త ఆలోచన అవసరాన్ని ఈ సందర్భం ముందుకు తెస్తోంది.విద్య మనిషికి జీవనోపాధిని అందించాలి. అదే సమయంలో జీవితాన్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే దృష్టిని కూడా ఇవ్వాలి. ఉద్యోగం కోసం అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు సామాజిక బాధ్యతను, హక్కుల పట్ల అవగాహనను, ఇతరుల పట్ల గౌరవాన్ని, నిజాన్ని తెలుసుకోవాలనే తపనను పెంపొందించడమే విద్య అసలు ధ్యేయం.ఒక వ్యక్తి చదవగలిగినప్పుడు మాత్రమే కాకుండా, చదివిన విషయాన్ని అర్థం చేసుకుని అవసరమైనప్పుడు ప్రశ్నించగలిగినప్పుడు నిజమైన అక్షరాస్యత వ్యక్తమవుతుంది. సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా దాని నిజానిజాలను పరిశీలించగలిగినప్పుడు; తన అభిప్రాయాన్ని చెప్పడంతో పాటు ఇతరుల భిన్న అభిప్రాయాలను గౌరవంగా వినగలిగినప్పుడు; అన్యాయాన్ని గుర్తించి స్పందించగలిగినప్పుడు ఆ విద్య సార్థకమవుతుంది.అక్షరాస్యత శాతం పెరగడం దేశ పురోగతికి ఒక ముఖ్యమైన పరిమాణాత్మక సూచిక కావచ్చు. కానీ సమాజంలో వివేకం, అవగాహన, ప్రశ్నించే సంస్కృతి, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం పెరిగినప్పుడే ఆ పురోగతికి నిజమైన గుణాత్మక అర్థం లభిస్తుంది.అక్షరాలను చదవడం విద్యకు తలుపులు తెరుస్తుంది. సమాజాన్ని చదవడం నేర్చుకున్నప్పుడే ఆ విద్య చైతన్యంగా మారుతుంది. అదే అసలైన అక్షరాస్యత.



యం. డి.
ఉస్మాన్ ఖాన్
9912580645

# జాతీయం-అంతర్జాతీయం

## హిందుత్వ ఎజెండా కోసమే జన, కులగణన

- హిందుత్వ ఎజెండా కోసమే జన, కులగణన
- జీడీపీపై మోడీ సర్కారు అంకెలా గారడీ
- దిమాగీ నక్సల్స్' ప్రమాదకర రాజకీయ ఆయుధం
- రామజన్మభూమి నిధుల దుర్వినియోగం సంఘ్‌పరివార్ హేయమైన చర్య
- కార్పొరేట్ల దురాశ వల్లే పర్యావరణ విధ్వంసం
- సీపీఐ (ఎం) ఆందోళన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 07 (ఎ.ఎం.ఎస్) :**
కార్పొరేట్ల దురాశ వల్లే పర్యావరణ విధ్వంసం జరుగుతున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. వాతావరణ మార్పుల కారణంగా ఇటీవల సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల్లో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతున్నదని తెలిపింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమావేశాలు ఢిల్లీలోని ఏకే గోపాలన్ భవన్‌లో రెండ్రోజులపాటు జరిగాయి. వీటిలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నేపాల్, చైనా దేశాలను ప్రభావితం చేసిన పెను విపత్తు హిమానీనదాలు కరిగిపోవడాన్ని, సరిగా పనిచేయని ముందస్తు హెచ్చరికల వ్యవస్థల పరిణామాలను ఎత్తిచూపుతున్నదని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. ఎల్‌నినో ప్రభావం కూడా తీవ్రంగా పనిచేస్తోందనీ, అస్సాం వంటి రాష్ట్రాల్లో వినాశకరమైన అకాల వరదలను చూశామని తెలిపారు. అదే సమయంలో అనేక ఇతర రాష్ట్రాల్లో వర్షపాత లోటు, కరువు పరిస్థితులు కన్పిస్తున్నాయనీ, వీటన్నింటికీ కార్పొరేట్ దురాశే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలను సంఘ్ పరివార్ నాయకులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతో ఓ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సంఘ్ పరివార్ నేతృత్వంలో జరిగిన రామమందిర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన అనేక మంది వ్యక్తులు ఇప్పుడు ఆలయ విరాళాలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఇది లక్షలాది మంది భక్తుల విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా అపవిత్రం చేయడమే అవుతుంది. రాజకీయ అండతో దోషులను కావాలని కాపాడడం, పవిత్రమైన కానుకలను దోపిడీ సొత్తుగా భావించి భక్తుల విశ్వాసాలతోనిర్భయంగా ఆటలాడుతున్నారని పొలిట్‌బ్యూరో ఆక్షేపించింది. ఈ చర్యలు సంఘ్ పరివార్ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయనీ, వీటిపై సమగ్ర విచారణ జరిపి, ఈ హేయమైన నేరంలో పాలుపంచుకున్న దోషులందరినీ శిక్షించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొంది.

గత నెల 10వ తేదీన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన నిరసన ప్రదర్శనల్లో భారీ సంఖ్యలో భాగస్వాములైన వారందరికీ అభినందనలు. అలాగే పరీక్షా పత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాలుపంచుకున్న విద్యార్థులు, యువతకు కూడా అభినందనలు. జంతర్‌మంతర్ నిరసనల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిరసిస్తూ గళం విప్పారు. కేంద్ర ప్రభుత్వ అణచివేత చర్యల పట్ల ప్రజలు...ముఖ్యంగా యువత విశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఈ విషయాన్ని నిరసనలు, ప్రదర్శనలు రుజువు చేస్తున్నాయి. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు రిజర్వేషన్ వ్యతిరేక నిరసనల వంటి మతపరమైన సమస్యలను, పోరాటాలను ప్రోత్సహించడం ద్వారా ప్రజల దృష్టిని ఈ ఆందోళనల నుంచి మళ్లించి వారిలో ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఢిల్లీలో సీపీఐ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొనకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల వైఖరిని ఖండిస్తున్నాం. ఈ ఘటనలన్నీ ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ నిర్మాణంపై పెరుగుతున్న దాడులకు అద్దం పడుతున్నాయి. ఈ దాడులను వ్యతిరేకించడానికి, మనం కష్టపడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఉంది.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి గణాంకం వెల్లడించిన దాని కంటే ఎక్కువగానే దాచిపెడుతోంది. ఇది ప్రధానంగా శ్రామిక వర్గం యొక్క వాస్తవ పరిస్థితులను మరుగుపరుస్తూ అసమానతలను మరింత పెంచే వ్యవస్థను చట్టబద్ధం చేయడానికి ఓ రాజకీయ సాధనంగా పనిచేస్తోంది. ఈ గణాంకాలు తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభం యొక్క వాస్తవికతలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నాయి. వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం వృద్ధితో కుంటుపడడం, గనుల రంగం క్షీణించడం వంటి వాస్తవాలను ఇది పట్టించుకోలేదు. కార్మికులు, రైతులపై పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని దాచిపెడుతోంది. ధరల పెరుగుదల, పోషకాహార లోపం, నిరుద్యోగం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న సామాన్య ప్రజల కష్టాలను జీడీపీ గణాంకాలు ప్రతిబింబించడం లేదు. బీజేపీ ప్రభుత్వం సముద్ర మంథన్ ప్రోత్సాహక పథకం, సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)2, మొబైల్ ఫోన్ల తయారీ పథకం ద్వారా ప్రజల సొమ్మును దేశీయ, విదేశీ ప్రయివేటు కార్పొరేట్లకు బదిలీ చేయడానికి సంస్కరణలను ప్రోత్సహిస్తుంది. కేంద్ర ప్రోత్సాహక కార్యక్రమాలకు అనుగుణంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇలాంటి కార్యక్రమాలనే ప్రకటించి, కార్పొరేషన్లకు భారీ మొత్తాలను బదిలీ చేస్తున్నాయి. సుభాష్ చంద్ర కేసు విషయంలో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఉత్తర్వు ఈ వనరుల బదిలీని పూర్తిగా మరో స్థాయికి తీసికెళ్లింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ - 2016 వ్యాపార సౌలభ్యం పేరుతో కార్పొరేట్ సంస్థల ద్వారా ప్రజాధనాన్ని చట్టబద్ధంగా దోచుకోవడానికి వీలు కల్పిస్తోంది. ఐబీసీ - 2016ను తక్షణమే రద్దు చేసి దాని స్థానంలో డిఫాల్టర్లను శిక్షించడానికి, ప్రజాధనం దోపిడీని అరికట్టడానికి పటిష్టమైన చట్టాన్ని తీసుకొని రావాల్సి ఉంది. బీజేపీ తన హిందుత్వ మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి 2027 జనాభా లెక్కలను వాడుకుంటోంది. 16 ఏండ్ల విరామం తర్వాత పౌరసత్వం, ఎన్నికల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అనేక ఇతర ప్రక్రియలు జరుగుతున్న తరుణంలో నిర్వహిస్తున్న ఈ జనగణనకు ప్రాముఖ్యత ఉంది. అయితే సమాచార సేకరణ కోసం ఉపయోగించిన పద్ధతి శాస్త్రీయమైనది కాదు. సమాచారాన్ని ఇతర డేటాబేస్‌లతో అనుసంధానించే అవకాశం తీవ్రమైన సమస్య. వ్యక్తిగత సమాచార సేకరణ, ఓటర్ల జాబితా ధృవీకరణ, పౌరసత్వంపై చర్చలు ఏకకాలంలో జరుగుతున్నాయి. చివరికి ఈ సమాచారాన్ని ఎలా ఉపయోగిస్తారు, ఎలా అనుసంధానిస్తారు అనే దానిపై ఆందోళనలు రేకెత్తుతున్నాయి. జనగణన ద్వారా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టవచ్చు. కాబట్టి ఈ లెక్కల సమయం కూడా చాలా ముఖ్యమైనది. భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య రాజకీయ ప్రాతినిధ్య పంపిణీపై ప్రభావం చూపవచ్చు. కులగణన కోసం అనుసరించిన పద్ధతి కూడా లోపభూయిష్టంగా ఉంది. ఎస్సీ, ఎస్టీలు మాత్రమే అందుబాటులో ఉన్న జాబితా నుంచి తమ కులాన్ని లేదా తెగను ఎంచుకోగలరు. ఇతరుల విషయంలో దాన్ని 'ప్రకటించినదిగా' నమోదు చేస్తారు. సాధారణ కుల సమస్యను నమోదు చేయడానికి సమగ్రమైన, ముందుగా నిర్వచించిన Z జాబితా లేదా వ్యవస్థీకృత యంత్రాంగం లేకపోవడం వల్ల కులాలు, ఉపకులాల వివరాలు అనేకం నమోదు కావచ్చు. కచ్చితమైన గణాంకాలు లభించవు. పార్టీ 24వ కాంగ్రెస్ ఆదేశాల మేరకు చేపడుతున్న దిద్దుబాటు ప్రక్రియపై రూపొందించిన నివేదికపై చర్చించడం జరిగింది. పార్లమెంటరీ విధానం వంటి బాహ్య వర్గ ప్రభావాలతో పాటు విధానాల అమలులో ఎదురైన అనుభవాలు, పార్టీలోని అన్ని స్థాయిల్లో సామూహిక పనితీరును బలోపేతం చేసే చర్యలపై కూడా చర్చించడం జరిగింది. అక్టోబర్ 9, 11 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమయ్యే పార్టీ కేంద్ర కమిటీ ఈ నివేదికపై చర్చిస్తుంది.ఎర్త్ సైన్స్ నేర్చుకోండి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన 'దిమాగీ నక్సల్స్' (మేధావి నక్సల్స్) వ్యాఖ్య చట్టబద్ధమైన రాజకీయ అసమ్మతిని అప్రదిష్టపాలు చేసేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం. ఈ పదం సాయుధ మావోయిస్టులకు, శాంతియుత ప్రజాస్వామ్య ప్రతిపక్షానికి మధ్య ఉన్న గీతను చెరిపేసే ఓ ప్రమాదకరమైన రాజకీయ ఆయుధం. ఈ వాక్చాతుర్యం భద్రతకు సంబంధించింది కాదు. రాజకీయ బహిష్కరణకు సంబంధించింది. విమర్శకులను అప్రదిష్టపాలు చేయడానికి, అసమ్మతిని అణచివేయడానికి, విద్య, ఉపాధి, ప్రజా సంక్షేమం వంటి విషయాల్లో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సైద్ధాంతిక శత్రువును సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం.

2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతుల వారిపై దాడులు పెరిగాయి. ఐఐటీ మండి వంటి ప్రముఖ సంస్థ అధికారులు చాతుర్వర్ణ వ్యవస్థను ప్రశంసిస్తూ పోస్టర్‌ను విడుదల చేయడం సిగ్గుచేటు. శూద్రుల కర్తవ్యం అగ్రవర్ణాలకు సేవచేయడమేనని ఆ పోస్టర్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఇటువంటి చర్యను ముక్తకంఠంతో ఖండించాలి. పోస్టర్‌ను విడుదల చేసిన బాధ్యులపై చర్య తీసుకోవాలి. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో రాజ్యసభ ప్రతిపక్ష నేత పట్ల వ్యవహరించిన తీరును కూడా ఖండించాలి. దోషులను శిక్షించాలి.

జులై నుంచి అంతర్జాతీయ పరిణామాలు తీవ్రమవుతున్న భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, ఆర్థిక అనిశ్చితితో కూడి ఉన్నాయి. పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న సంఘర్షణల కారణంగా ఇంధన, ఆర్థిక మార్కెట్లలో తలెత్తిన గందరగోళం, అలాగే ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఎదుర్కొంటున్న అధిక ద్రవ్యోల్బణం, రుణ సంక్షోభాలు వంటి కీలక ఘటనలు చోటుచేసుకున్నాయి.

పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దాడులు మరోసారి మధ్యప్రాచ్యాన్ని, ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యమిస్తున్న భారత ప్రభుత్వం అమెరికా దురాక్రమణను ఖండించి, తీవ్రవాద దాడులకు గురవుతున్న పాలస్తీనా, ఇరాన్, క్యూబా దేశాలకు సంఘీభావం ప్రకటించాలి.



## మంటల్లో విమానం

- ఐదుగురు దుర్మరణం
- అమెరికాలో దుర్ఘటన

**వాషింగ్టన్, సెప్టెంబరు 07 :**
అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ ప్రమాదం జరిగింది. అమెజాన్ కార్గో విమానం రన్‌వేపై నుంచి పక్కకు దూసుకెళ్లి.. సమీపంలోని వాహనాలను ఢీకొంది. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు వెల్లడించారు.ప్యూర్టో రికో నుంచి వచ్చిన విమానం మియామి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా.. రన్‌వేపై ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. సమీపంలో ఇతర వ్యాపారాల కోసం ఉపయోగించే రోడ్డుపైకి దూసుకెళ్లి.. అక్కడి వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంతో విమానంలో మంటలు చెలరేగి, ఘటనాస్థలమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఈ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. పైలట్, కోపైలట్, వాహనాల్లో చిక్కుకుపోయిన వారిని, అలాగే విమానం కింద ఇరుక్కుపోయిన వ్యక్తిని సహాయక సిబ్బంది బయటకు తీశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐదురుగు ప్రాణాలు కోల్పోగా.. పలువురిని ఆస్పత్రికి తరలించారు. మృతులు విమానంలోని వారా..? రోడ్డుపై ఉన్న వ్యక్తులా అనే దానిపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

## మతపరమైన వేడుకలో ప్రమాదం

- పది మంది మృతి-64 మందికి గాయాలు

**టెమాస్కాల్సింగో, సెప్టెంబరు 07 :**
మెక్సికోలోని టెమాస్కాల్సింగో పట్టణంలో మతపరమైన వేడుకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా సామగ్రి భారీగా పేలడంతో 10 మంది మృతి చెందగా, మరో 64 మంది గాయపడ్డారు.



పేలుడు ధాటికి సమీపంలోని గోడ కూడా కూలిపోయింది. ఈ ఘటనపై మెక్సికో అటార్నీ జనరల్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించింది. బాణసంచా నిల్వ, నిర్వహణ, భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం కారణమా అన్న కోణంలో విచారణ జరుగుతోంది. క్షతగాత్రుల్లో ఇద్దరు మతగురువురు కూడా ఉన్నారని స్థానిక బిషప్ తెలిపారు.



## ప్రభుత్వ వాదన విన్న తర్వాతే తుది విచారణ

- వైవాహిక అత్యాచారంపై సుప్రీంకోర్టు
- ఇందిరా జైసింగ్ అభ్యర్థన తిరస్కరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 07 (ఎ.ఎం.ఎస్) :**
వైవాహిక అత్యాచారానికి మినహాయింపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది విచారణ తేదీని కేంద్ర ప్రభుత్వ వాదన విన్న అనంతరం నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. ఈ కేసులను నవంబర్‌కు వాయిదా వేయాలన్న సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ అభ్యర్థనను ధర్మాసనం అంగీకరించలేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది జైసింగ్ ఈ పిటిషన్లను ప్రస్తావించారు. కేంద్రం ఇప్పటి వరకు ఈ అంశంపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయలేదని, పిటిషన్ల ప్రతులను కూడా సంబంధిత న్యాయవాదులు పరస్పరం పూర్తిగా మార్చుకోలేదని ఆమె పేర్కొన్నారు. అందువల్ల తుది విచారణను నవంబర్‌కు వాయిదా వేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది వ్యాఖ్యలపై స్పందించిన ధర్మాసనం.. కేసును సెప్టెంబర్ 9న విచారించి కేంద్రం వాదనను వింటామని తెలిపింది. అనంతరం తుది విచారణకు తగిన తేదీని నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. వైవాహిక అత్యాచారానికి సంబంధించిన పలు పిటిషన్లు ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు ఉన్నాయి.

## గాజా మారణహోమం.. కన్నీటి సాగరం...

- 100 మంది పార్థివ దేహాలు..
- అందులో 60 భౌతికకాయాలు చిన్నారులవే
- అన్నీ సామూహిక ఖననం
- గుండెలు బాదుకుంటున్న బంధువులు

**గాజా, సెప్టెంబరు 07 :**
పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి తెరపడటంలేదు. నెతన్యాహు యుద్ధకాంక్షకు వేల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రంప్ జోక్యం చేసుకుని కాల్పుల విరమణ ప్రకటించినా.. ఇజ్రాయిల్ దమనకాండ ఏ మాత్రం ఆగటంలేదు. గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న విధ్వంసకాండలో ధ్వంసమైన, దెబ్బతిన్న భవనాల్లో ఇంకా వేలాది మంది మృతదేహాలు పూడ్చిపెట్టి ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. తాజాగా గాజా నగరంలోని జైటౌన్ ప్రాంతంలో ధ్వంసమైన భవనాల శిథిలాల నుంచి సుమారు 100 మంది మృతదేహాలను వెలికి తీశారు. వారిలో 60 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ఆదివారం కుటుంబ సభ్యులు ఆ పార్థివ దేహాలను జైటౌన్ నుంచి గాజా నగర మధ్యభాగంలోని అల్‌మామదానీ స్మశానవాటికకు ఖననం కోసం తీసుకువచ్చారు. అక్టోబర్ 2023లో గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంలో ధ్వంసమైన ఇండ్ల శిథిలాలను పౌర రక్షణ సిబ్బంది, కుటుంబ సభ్యులు వారాల తరబడి తవ్వారు. మృతుల్లో చాలామంది విస్తృత మలకా కుటుంబానికి చెందినవారే ఎక్కువగా ఉన్నారు. ఆ కుటుంబమే 55 మంది సభ్యులను కోల్పోయింది.స్మశానవాటికల్లో తమ బంధువులను ఖననం చేసేందుకు ఆ కుటుంబాలు చాలా కాలం వేచి చూశాయని అల్‌అలౌల్ అన్నారు. కుటుంబ సభ్యుల అవశేషాలను ఖననం చేసే అవకాశం 'ప్రతి కుటుంబానికి అందుబాటులో లేదు' అని ఆయన అన్నారు. యుద్ధ సమయంలో గాజాలోని ఇతర ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దళాలు స్మశానవాటికలను సైతం ధ్వంసం చేసి, తవ్వేశాయని ఆయన పేర్కొన్నారు.

గాజా నగరంలో ఇజ్రాయిల్‌హమాస్ యుద్ధ సమయంలో కూల్చివేసిన ఇండ్ల శిథిలాల నుంచి వెలికితీసిన పాలస్తీనియన్ల మృతదేహాల వద్ద సంతాపకులు కొవ్వొత్తులు వెలిగించారు. ఇజ్రాయిల్ ఆక్రమణ వల్ల మృతదేహాల వెలికితీత ప్రక్రియ ఆలస్యం అయిందని, ఇప్పటికీ ఆ పరిస్థితి కొనసాగుతోందని అల్‌అలౌల్ అన్నారు.గాజా పౌర రక్షణ సేవల అధిపతి రాద్ అల్‌దహ్‌షాన్, గల్లంతైన వేలాది మృతదేహాల వెలికితీత కార్యకలాపాలు చేపట్టేందుకు తమ బృందాలు ప్రణాళికలు రూపొందించాయని, అయితే భారీ యంత్రాల కొరత కారణంగా ఆ పని ఆలస్యమవుతోందని అల్ జజీరాకు తెలిపారు.

శిథిలాల కింద ఇంకా సుమారు 8,000 మృతదేహాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నామని, సరైన పరికరాలు ఉంటే వాటిని వెలికితీసే ప్రక్రియను దాదాపు 90 రోజుల్లో పూర్తి చేయవచ్చని దహ్‌షాన్ పేర్కొన్నారు. ఒకవేళ ఆ పరికరాలను గాజాలోకి



రానివ్వకుండా అడ్డుకుంటే... ఈ పని ఏండ్ల తరబడి కొనసాగే అవకాశం ఉందని ఆయన అన్నారు.అయితే, అవసరమైన పరికరాల జాబితాను అంతర్జాతీయ సంస్థలకు అందించామని, ఆ సామగ్రిని నేరుగా తమ (సివిల్ డిఫెన్స్) వద్ద కాకుండా అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉంచడానికైనా సిద్ధమేనని ఆయన తెలిపారు. మృతదేహాలను తక్షణమే గుర్తించి వెలికి తీయడానికి తమ బృందాలకు భారీ ఎక్స్‌కవేటర్లు, వ్యక్తిగత రక్షణ పరికరాలు, అన్వేషణ పరికరాలు అవసరమని ఆయన చెప్పారు.

మృతదేహాలను గుర్తించేందుకు దాడి సమయంలో భవనంలో ఎవరు, ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు ప్రాణాలతో బయటపడిన వారు, పొరుగు కుటుంబాలపై ఆధారపడుతున్నట్టు ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలోలభించిన వాటిని వర్గీకరించి నమోదు చేసే ఇంజనీర్ల బృందం కూడా వారికి సహకరిస్తోందని తెలిపారు. దాడులకు ముందు నివాసితులను అప్రమత్తం చేయడంలో ఇజ్రాయిల్ బలగాలు విఫలం కావడం వల్ల, వేలాది మృతదేహాల కోసం ఇండ్ల వద్ద ఇంకా శిథిలాలను తొలగించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయ అధిపతి అజిత్ సుంఘే అల్ జజీరాతో మాట్లాడుతూ, ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లోని దృశ్యాలు "ఈ సంఘర్షణలోని క్రూరత్వాన్ని" గుర్తుచేస్తున్నాయని అన్నారు. కొన్ని మృతదేహాలు 2023 నవంబర్ నాటివని ఆయన పేర్కొన్నారు." వేలాది మంది ప్రజలు ఇంకా ఈ శిథిలాల కింద చిక్కుకుని ఉన్నారు... ఇవి ఇజ్రాయిల్ సైనిక నియంత్రణలో ఉండవచ్చని భావిస్తున్న ప్రాంతాలు - గాజాలో 70 శాతం వరకు ఇలాంటి పరిస్థితి ఉంది - మృతదేహాలను వెలికితీయడానికి ఈ ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా ఉంది." "బాధ్యత నిర్ధారణ జరగాలి... ఈ సున్నితమైన సమయంలో మనకు లభించిన సాక్ష్యాలను భద్రపరచడం చాలా ముఖ్యం." అని వివరించారు.అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకు కనీసం 73,651 మంది పాలస్తీనియన్లు మరణించగా, 174,592 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.

ఇటీవలి వారాల్లో జరిగిన ఇలాంటి సహాయక చర్యల్లో, ఒకే దాడిలో మరణించిన అబూ షరియా, హసానియా కుటుంబాలకు చెందిన 100కు పైగా మృతదేహాలను, అలాగే అల్‌తాజ్ టవర్ ప్రాంతం నుంచి 500కు పైగా మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు, కార్యకర్తలు తెలిపారు.

## కల్తీ మద్యం కేసులో 12కి చేరిన మృతులు

- వైద్యుల పర్యవేక్షణలో 30 మంది
- ఇద్దరి పరిస్థితి విషమం

**భోపాల్, సెప్టెంబరు 07 (ఎ.ఎం.ఎస్) :**
మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం కేసులో మృతుల సంఖ్య 12కి చేరింది. సుమారు 30మంది వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. వారిలో ఒకరిని మెరుగైన వైద్య చికిత్స కోసం విమానంలో భోపాల్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుల ఆధారంగా మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సాగర్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిఐజి) శశీంద్ర చౌహాన్ తెలిపారు. ఎఫ్ఐఆర్‌లలో నిందితులుగా పేర్కొన్న 30 మందిలో 14 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని అన్నారు. సోమవారం తెల్లవారుజామున మరో వ్యక్తి మరణించడంతో మృతుల సంఖ్య 12కు చేరిందని సాగర్ కలెక్టర్ ప్రతిభా పాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు ఎక్సైజ్ అధికారులను, ఇద్దరు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు సాగర్ కలెక్టర్ ప్రతిభా పాల్ తెలిపారు.



## సత్య నికేతన్ హాస్టల్ యజమాని అరెస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 07 (ఎ.ఎం.ఎస్) :**
ఢిల్లీలోని ఐదంతస్తుల భవన్ సత్య నికేతన్ హాస్టల్ కూలిపోయిన విషయం తెలిసిందే. సదురు బిల్డింగ్ యజమాని హరిరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భవనం కూలిపోయిన తర్వాత ఓనర్ పరారీలో ఉన్నాడు. అతని కోసం 10 బృందాలతో పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో రాజస్థాన్‌లోని భివాడిలో బిల్డింగ్ యజమాని హరిరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య ఏడుకు చేరగా, సహాయక చర్యలు కొనసాగుతుండగా 12 మందిని సురక్షితంగా బయటకు తీశారు.

## నౌకలపై పరస్పరం దాడులు

**దుబాయి, సెప్టెంబరు 07 :**
మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇరాన్ సేనల మధ్య 'జల' పోరాటం తీవ్రమవుతోంది. టెహ్రాన్ పరిసరాల్లోని జలాల్లో ప్రయాణిస్తున్న నౌకలపై శనివారం ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్‌కు చెందిన మూడు చమురు నౌకలపై అమెరికా దాడి జరపగా హార్ముజ్‌లో అనుమతి లేని మార్గాల్లో ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఖర్గ్ దీవి తీరంలో ప్రయాణిస్తున్న ఓ నౌక సహా మొత్తం మూడు ఇరాన్ నౌకలపై దాడి చేశానని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలియజేసింది. అంతకుముందు అమెరికా నేవీకి చెందిన రెండు నౌకలపై ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. 'ఐఆర్‌జీసీకి మేము స్పష్టమైన సంకేతాన్ని ఇస్తున్నాం. మీరు మా దేశానికి చెందిన రెండు నౌకలపై దాడి చేస్తే మేము మీ



దేశానికి చెందిన మూడు నౌకలపై దాడి చేసి అంతకంటే ఎక్కువగా మీకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాం' అని యూఎస్ సెంట్రల్ కమాండ్ అధినేత అడ్మిరల్ బ్రాడ్ కూపర్ హెచ్చరించారు.

సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న అమెరికా సైనిక నౌకలపై ఇరాన్ పెద్ద ఎత్తున దాడులు జరిపింది. మూడు ట్యాంకర్లపై, అలాగే అమెరికాకు సంబంధించిన మరో మూడు నౌకలపై దాడులు జరిపామని తెలిపింది. 'ఉగ్రవాద అమెరికా సైన్యం మాటలు విని మోసపోకండి. అనధికార జలమార్గం మీదుగా ప్రయాణించే నౌకలకు దూరంగా ఉండండి. లేకుంటే మిమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటారు' అని ఇరాన్ ప్రభుత్వ టీవీలో ప్రసారమైన ఓ ప్రకటనలో ఐఆర్‌జీసీ నౌకాదళం హెచ్చరికలు జారీ చేసింది. కాగా ఖర్గ్ నౌకాశ్రయం ప్రాంతంలో ఓ ట్యాంకర్‌పై నాలుగు అమెరికా క్షిపణులు దాడి చేశాయని ఇరాన్ అధికార వార్తా సంస్థ తస్నిమ్ తెలియజేసింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ట్యాంకర్ సిబ్బందిని అక్కడి నుంచి తరలిస్తున్నారని చెప్పింది.

## గడువు పొడిగించండి

- ఆరావళిపై నియమించిన ఉన్నతస్థాయి కమిటీ విజ్ఞప్తి
- సుప్రీంకోర్టుకు అప్పీల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 07 (ఎ.ఎం.ఎస్) :**
ఆరావళి కొండల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణపై సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ(హెచ్‌పీసీ)ని నియమించిన విషయం తెలిసిందే. సదురు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక సమర్పణపై గడువు పొడిగించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ఈ ఏడాది నవంబర్ 30 వరకు ధర్మాసనం గడువు ఇచ్చింది. ఫిబ్రవరి 2027 వరకు గడువు పొడిగించాలన్న కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అవసరమైతే కమిటీ "పగలు రాత్రి" పనిచేయాలని భారత



ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన వర్గాలతో సహా సంబంధిత వర్గాలన్నింటి వాదనలు వినాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి హెచ్‌పీసీ మరో ఆరు నెలల సమయం కోరింది. ఈ విషయంపై తదుపరి విచారణ డిసెంబర్ 2న జరగనుంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా

**నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 7: వుదయం ప్రతినిధి**



నిరుద్యోగం నేడు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని పేర్కొన్నారునిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పూర్తిగా పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతర, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా సెప్టెంబర్ 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోదాడ పట్టణంలోని *సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్*లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుందని తెలిపారు.2024 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు.:

మొత్తం 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు. తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేశానని, ఈ ప్రయత్నాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు.

నిర్వహణ కమిటీ ఏర్పాటు కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతోపాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు.అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేస్తుందని పేర్కొన్నారు. నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో జరుగుతుందని వెల్లడించారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :**



జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలను స్వీకరించారు .ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులను తీసుకుంటూ వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (422) దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు.

ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి దేవరుప్పుల మండలం, దేవరుప్పుల గ్రామానికి చెందిన కదారు లక్ష్మా రెడ్డి, 0.05 గుంటల భూమిని కొత్త పాస్ పుస్తకంలో నమోదు చేయాలని మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

లింగాల ఘనపురం మండలం, వనపర్తి గ్రామానికి చెందిన గంగపురం సుశీల, తన వ్యవసాయ భూమిని పట్టా చేయగలరని, అలాగే పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించగలరని విజ్ఞప్తి చేస్తూ దరఖాస్తు చేసియున్నారు. బచ్చన్నపేట మండలం, లింగంపల్లి గ్రామానికి చెందిన కర్ర రాం రెడ్డి, తాను దివ్యాంగులని, పింఛను రావడం లేదని, సదరం సర్టిఫికెట్ ఉందని, ఈ విషయమై పింఛను మంజూరు చేయగలరని ప్రార్థిస్తూ ఆర్జీ ద్వారా కోరారు. పాలకుర్తి మండలం, ముత్తారం గ్రామానికి చెందిన కొండ కరుణాకర్ రెడ్డి, తను రెండు ఎకరాల కుష్కీ భూమిని కొన్నారని, రికార్డు ప్రకారం సర్వే నంబర్ లో లేదని, ఈ క్రమంలో భూమి సర్వే చేశారని, సర్వే నంబర్ ప్రకారం పాస్ పుస్తకం ఇప్పించుట గురించి దరఖాస్తును సమర్పించినారు..ఘనపూర్ (స్టేషన్) మండలం, ఇంద్ర నగర్ కు చెందిన చింత అనూష, తనది నిరుపేద కుటుంబం అని, కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నారని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని వినతిని అందించారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చినకోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ



**భూపాలపల్లి : సెప్టెంబర్ 07 (వుదయం విలేకరి):**

కాటారం నూతన సబ్ కలెక్టర్‌గా నియమితులైన సౌరబ్ శర్మ సోమవారం ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందచేశారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జిల్లా కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్, కాటారం డివిజన్‌లో పాలనాపరమైన అంశాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాటారం డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలన కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):**



వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణిలతో కలిసి ఆయన మాట్లాడారు. మండపాల నిర్వాహకులు పోలీస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందినతర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలి.నిబంధనలపాటింపు, మండపాల వద్ద జూదం, అభ్యంతరకర ప్రసంగాలకు తావులేకుండా కేవలం భక్తి కార్యక్రమాలే నిర్వహించాలి. డీజేలకు అనుమతి లేదు; భక్తిగీతాలు మాత్రమే వినిపించాలి. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మసీదుల సమీపంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి.ప్రార్థనా సమయాల్లో మసీదుల వద్ద పూర్తి సహకారం అందించాలి. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. , సంబంధిత అధికారుల ముందస్తు అనుమతితోనే విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలి. అధికారులకు ఆదేశాలు: మున్సిపల్, పంచాయతీ అధికారులు పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలి. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలి. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఉత్సవ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి
## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం సెప్టెంబర్- 07 (వుదయం బ్యూరో):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారుప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**జిల్లా, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి**

**నేడు 66 దరఖాస్తులు స్వీకరణ**

**సూర్యాపేట, సెప్టెంబర్ 7: (వుదయం ప్రతినిధి):**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి 35, హౌజింగ్ 12, డిపిఓ 3, డిఎంహెచ్ఓ 3, మిగిలిన 13 వివిధ శాఖలకు చెందినవి కలిపి మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

## గిరిజనులు సమర్పించిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలి
## ఐటీడీఏ పీవో బి. రాహుల్



**గిరిజనుల ప్రతి విన్నపాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి**

**భద్రాచలం, 7సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి):**

వివిధ ఆదివాసి, గిరిజన గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు గిరిజన దర్బార్‌లో సమర్పించే వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత శాఖల యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసి ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల వినతులు, సమస్యలు, ఫిర్యాదులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ట్రైబల్ వెల్ఫేర్ ఆనందకుమార్, గురుకులం ఆర్‌సీఓ అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్వో సైదులు తదితర అధికారులతో కలిసి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, గృహాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం, వ్యవసాయం, సామాజిక భద్రత, భూముల సమస్యలు తదితర అంశాలను గిరిజనులు పీవో దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ ఆదివాసి, గిరిజన ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం గిరిజన దర్బార్‌ను ఒక ముఖ్యమైన వేదికగా ఏర్పాటు చేసిందన్నారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి ఎంతో వ్యయప్రయాసలతో కార్యాలయానికి వచ్చే ప్రజల వినతులను అధికారులు సాధారణ దరఖాస్తులుగా కాకుండా అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. గిరిజన దర్బార్‌లో స్వీకరించిన ప్రతి వినతిపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. . తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, ఇతర శాఖలు లేదా ఉన్నతాధికారుల పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే వారి దృష్టికి తీసుకెళ్లి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు గిరిజన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వ శాఖలు పనిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పీవో సూచించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని అన్నారు.

గిరిజన దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులు గిరిజన దర్బార్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు అనేక సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు.స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు గిరిజనులు కోరారు. ఎల్‌టీఆర్ భూముల సమస్యలను పరిష్కరించాలని, గిరిజనులకు సంబంధించిన భూముల హక్కులను పరిరక్షించాలని, పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిశీలించి న్యాయం చేయాలని కూడా వినతులు అందాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కొందరు దరఖాస్తు చేసుకున్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధే ఐటీడీఏ ప్రధాన లక్ష్యమని,

ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను అత్యంత బాధ్యతతో పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని బి. రాహుల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, పీవీటీజీ అధికారి గన్యా, ఎల్‌టీఆర్‌డీటీ మణిధర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూయ, మిషన్ భగీరథ వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల సిబ్బంది స్వాతి, కార్తీక్, వెంకటేశ్వర్, విజయ్ పాల్గొన్నారు.

## పండగ, జాతర సమయాల తీరుపై పోలీస్ శిక్షకులకు శిక్షణ

**వరంగల్ క్రైం, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :**






శాంతి భద్రతలకు సంబందించి జరిగే పండగలు, జాతరలు, వూరేగింపులు లాంటి సందర్భాలలో ఎక్కువ జన సమూహం వున్నప్పుడు వారి పట్ల అక్కడ విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యహరించాల్సిన తీరుపై భద్రాద్రి జోనల్ పరిధిలోని పోలీస్ శిక్షకులకు మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో నాలుగు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించబడ్డాయి.

వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళతో సహ మొత్తం 43మంది పోలీస్ శిక్షకులకు ఏర్పాటు చేసిన. ఈ శిక్షణ తరగతుల్లో ప్రధానంగా పండగలు, జాతరలు, వూరేగింపులు జరిగే సమయాల్లో అక్కడికి వచ్చే ప్రజలతో పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యహరించాల్సిన తీరుపై శిక్షణకు వచ్చిన పోలీస్ అధికారులకు తరగతి గదుల్లో భోధించడంతో పాటు ప్రాక్టీకల్‌గా అధికారులు వివరిస్తారు.వివిధ జిల్లాల నుండి శిక్షణకై తరలివచ్చిన పోలీస్ శిక్షకులు శిక్షణ అనంతరం వారి వారి జిల్లా పోలీస్ యూనిట్లలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇదే తరహాలో శిక్షణ అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, సిటిసి ఏసిపి రమణబాబు, ఆర్.ఐ సింహచలం శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్‌తో ఇతర శిక్షణ కేంద్రం పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

## పోషకాల వేదిక, మజ్జిగతో సకల ఆరోగ్యం




**కాజీపేట, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :**

పింగళి మహిళా కళాశాల ఆధ్వర్యంలో 'మజ్జిగ ప్రయోజనాలపై' అవగాహన కార్యక్రమం జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని పింగళి ప్రభుత్వ మహిళా (స్వయంప్రతిపత్తి) కళాశాల సూక్ష్మజీవశాస్త్ర, ఆరోగ్య సంరక్షణ శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో సుబేదారి రెడ్‌క్రాస్ సొసైటీ వద్ద మజ్జిగ ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ, సమతుల్య ఆహారం, పరిశుభ్రమైన ఆహారపు అలవాట్లు మరియు శరీరానికి తగినంత నీరు అందించడం ఎంతటి అత్యవసరమో వివరించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. మజ్జిగ అత్యంత చౌకైన, పోషక విలువలు కలిగిన పానీయమని,

ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందని అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మార్గదర్శకత్వంలో, సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. రేణుక పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎస్. సుమన్ కళ్యాణ్, కె. వైష్ణవి, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య సేవల అమలులో జిల్లా ముందంజలో ఉండాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హనుమకొండ, సెప్టెంబర్ 07 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను ముందంజలో నిలబెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల అమలుతీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా నెలవారీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగే సీ సెక్షన్ ప్రసవాలపై నిరంతరం ఆడిట్ నిర్వహించాలని స్పష్టం చేశారు. అధిక సంఖ్యలో సిజేరియన్లు చేసే ప్రైవేట్ ఆస్పత్రులను అధికారులు తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్, ఎన్సీడీ స్క్రీనింగ్ పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా వైద్య శిబిరాలు, స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డీఐవో డాక్టర్ కృష్ణారావు, అడిషనల్ డీఎంహెచ్ వో డాక్టర్ మదన్ మోహన్ రావు, ఎన్సీడీ అధికారి డాక్టర్ మురళి, ఎంసీహెచ్ ఓ డాక్టర్ రజిత, డిప్యూటీ డీఎంహెచ్ వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో 'ప్రజావాణి', మట్టి గణపతుల పోస్టర్ ఆవిష్కరణ



**మహబూబాబాద్, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి తదితర అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ: వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 144 అర్జీలు రాగా, వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖలకు తక్షణమే పంపించారు. అర్జీదారులు ఉదయం 10:30 గంటల లోపు పేర్లు నమోదు చేసుకుని, టోకెన్ ప్రాతిపదికన అధికారులను కలవాలి. వినతిపత్రంలో పూర్తి వివరాలు, ఫోన్ నంబర్, అవసరమైన ధృవీకరణ పత్రాల నకళ్లు (Xerox) జత చేయాలి. ఆదేశాలు: అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని, అవసరమైతే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తీసుకున్న చర్యలను అర్జీదారులకు ఎస్ఎమ్ఎస్ లేదా లేఖ ద్వారా తెలియజేస్తూ, ప్రజావాణి పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. పాస్ పుస్తకాల పంపిణీ: నారాయణపురం గ్రామానికి చెందిన దారావత్ రవి నాయక్, యమునా సర్పంచ్, కైక, వెంకట్ రెడ్డి, సుమన్, శ్రీలతలకు పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. పోస్టర్ ఆవిష్కరణ: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే వినియోగించాలని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్, కలెక్టరేట్ ఏవో పవన్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**హనుమకొండ, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి) :**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు' అందుకున్న పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి) అధ్యాపకులను కళాశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించింది. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి. రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ & అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. పి. రాజి రెడ్డిలు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఉత్తమ అధ్యాపకులను ఈ పురస్కారాలు వరించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని, వారి విద్యా సేవలు, అంకితభావం తోటి అధ్యాపకులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి నిరంతరం ప్రోత్సాహిస్తున్న కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. అరుణ, హెచ్ఓడీ డా. ఎ. సారంగపాణితో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

**గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం**

**ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాలకు అభివృద్ధి పనులు**

**ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణం లో పాల్గొనడం అదృష్టం**

**ఉపముఖ్యమంత్రి విక్రమార్క**

**ధర్మపురి సెప్టెంబర్7(వుదయం ప్రతినిధి):**



రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారు జామున మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రులకు పూర్ణకుంభ స్వాగతంపలికారు. ముందుగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో ఉపము ఖ్యమంత్రి, మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమ గీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచన లకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. బాసర నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయా లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పుష్క రాల పనులు నిర్వహించడానికి బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ.200కో ట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనుల ప్రారంభానికి రావడం అదృష్టంగా ఉందని ఉపముఖ్యమంత్రి అన్నారు. అద్భుత కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క అన్నారు. వచ్చే పుష్కరాలు నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి వివరించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ధర్మపురిలోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్ల కేటాయించగా పనుల ప్రారంభానికి ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా రూ.2.48 కోట్ల తో ఏర్పాటు చేస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టిన అభి వృద్ధి కార్యక్రమాల్లో భాగం గా ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.22.16 కోట్లతో చేపట్టిన పనుల కు శంకుస్థాపన చేశారు. ధర్మపురి, కోటి లింగాలలో రూ.58.55కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ధర్మపురికి రూ.80 కోట్లు మంజూరు.. ధర్మపురినియోజకవర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మరో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు. గోదావరి పుష్కరాలకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాల నిధులు సుమారుగా 200 ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకు సాగుతున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గానికి 117కోట్లు విడుదల గాక ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క రూ.80కోట్లు కోట్లకు చేరింది. లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకురాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయంసాధించి నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు.

# వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 7 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**



రానున్న వినాయక ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రానున్న వినాయక ఉత్సవాల నిర్వహణపై పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని మతాల పండుగలు సహోదర భావంతో, కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలు మొత్తం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వైర్లను సరి చేస్తామని చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తమ వంతుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. అలాగే వినాయక నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్లపై ఉన్నగుంతలను పూడ్చివేసి శోభా యాత్రకు అనుకూలంగా మారుస్తామని వివరించారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.

**వినాయక ఉత్సవాలు శాంతి యుతంగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటాం: జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో గణేష్ ఉత్సవాలు మొత్తం ప్రశాంతంగా పూర్తయ్యేలా పోలీసు శాఖ తరుపున తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వేడుకలకు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంబంధిత అధికార యంత్రాంగంతో పోలీసు శాఖ సమన్వయంతో పని చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, శాంతి కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కమాన్ పూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన జి. స్వప్న గ్రామ శివారులోని తమ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటూ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్న జి.రమేష్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కమాన్ పూర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన వడ్డేపల్లి చైతన్య తాను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీకాం పూర్తి చేశానని, తనకు ఎక్కడైనా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన షాహిదా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన దుగ్గంపూడి శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సర్వేనెంబర్ 58 లో గల భూమి పై హైకోర్టులో కేసు నడుస్తుందని అక్కడ అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ పెద్దపల్లికి రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం సూచనలు చేశారు.జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, కాగజ్‌నగర్ మండలం కోయవాగు గ్రామానికి చెందిన కాంపెల్లి అరుణ ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పేరిట ఉన్న పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామానికి చెందిన జాడి భగవాన్ తన పట్టా భూమి వేరొకరి పేరిట నమోదైందని, ఆ పేరును సవరించి తన పేరిట నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన నగోషా యమునబాయి వితంతు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. అదేవిధంగా రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన గుండేటి స్వరూప, జైనూర్ మండలం ఊషేగాం గ్రామానికి చెందిన కోవ కమలాబాయి తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్: ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 62**

**జగిత్యాల సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తేదీ 7 9 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు వినతులు అందాయని వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచిం చారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరెట్లో ఏర్పాటు చేసిన 41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల నేపథ్యం లో 25 8 2026 నుండి 8 9 2026 వరకు నిర్వహిస్తున్న క్యాంపు లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్ లత బి రాజగౌడ్ ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) బిఎస్ లత అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి రాజ గౌడ్ డిఆర్ఓ కె వై ప్రసాద్ జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# కార్మికుల భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రా..

**మంచిర్యాల డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి**

**-సింగరేణి పై నీతులు చెప్పొద్దు... పదేళ్ల పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలి..**

**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్..**

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 07(వుదయం ప్రతినిధి)**



బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా కాకుండా, ఆయన పదేళ్ల పాలనలో జరిగిన విషయాలను ప్రజలకు వివరిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్ లు అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆధ్వర్యంలో సింగరేణి, చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.తాడిచర్ల-2 ఓసీ, ఆర్కే ఓసీ-2 ప్రాజెక్టులకు అనుమతులు సాధించడం, సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం, జైపూర్ పవర్ ప్లాంట్ విస్తరణ, రైల్వే సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలను ప్రస్తావించారు. డీఎంఎఫ్‌టీ, మున్సిపల్, నియోజకవర్గ అభివృద్ధి నిధులతో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 72,600 ఉద్యోగాలు కల్పించామని, గత పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బాల్క సుమన్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా అభివృద్ధిపై చర్చించాలని సూచించారు. బాల్క సుమన్ దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని, సింగరేణి పై నీతులు చెప్పొద్దని పదేళ్ల పాలన పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ స్టేట్ రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ ఎర్రబెల్లి రాజేష్, కొక్కుల సతీష్, రాజ్ కుమార్, బొడ్డుల ప్రేమ్ సాగర్, అందుగుల మహేష్, పైడాకుల శ్రీనివాస్, నాగులు, మహిళా నాయకురాళ్ళు కొలిపాక దీప, దాసరి లక్ష్మి ,శనిగారపుఅనూష తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్



**కరీంనగర్ సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):**

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి 197 అర్జీలు స్వీకరించారు. మొత్తం అర్జీలు అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 68, కరీంనగర్ నగరపాలక కు29 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని.. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్ లో అప్ డేట్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాము వద్ద పటిష్ట భద్రత



**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**

ఈవీఎం గోదాము వద్ద నిరంతరం పటిష్ట భద్రతతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గోదాములో భద్రపరిచిన ఓటింగ్ యంత్రాల బాక్సులను తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి.. కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 7 (వుదయం ప్రతినిధి):**



విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని, ఉన్నత స్థానాలకు చేరాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక పరిస్థితులు, పుట్టిన ప్రాంతం అడ్డంకులు కావని, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు 150 మంచాలు, బెడ్స్ అందించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల కేజీబీవీలో ఏర్పాటు చేసిన మంచాలు, బెడ్స్ ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న వసతులు, మెనూ ప్రకారం భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాల్లో అందుతున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో వసతులు, భోజన నాణ్యతను పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళికతో చదువుతూ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగం లేదా స్వయం ఉపాధిలో స్థిరపడిన అనంతరం సమాజానికి సేవ చేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల వినియోగాన్ని తగ్గించాలని, పెద్దలను గౌరవిస్తూ సామాజిక బాధ్యతతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జీసీడీఓ పద్మజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ కే. రాజీవ్‌కుమార్, బ్యాంక్ చీఫ్ మేనేజర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేవా రెడ్డికి శ్రీకాంత్ రెడ్డి నివాళి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

తలమడుగుమండలందేవాపూర్ గ్రామానికి చెందిన తౌడ దేవా రెడ్డి పెద్ద కర్మ కార్యక్రమానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవా రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## శ్రీకారం చుట్టిన నూతన గృహం



**కోహీర్ సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి)**

నరసింహులు యాదవ్ నూతన గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.
ఈ శుభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్రవంతి రెడ్డి హాజరైయారు కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, నాయకులు, ప్రముఖులకు నరసింహులు యాదవ్ కుటుంబం సమేతంగా ఘన స్వాగతం పలికారు.నూతన గృహంలోకి అడుగుపెట్టిన నరసింహులు యాదవ్ దంపతులకు స్రవంతి రెడ్డి మరియు ఇతర ముఖ్యులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.నూతన గృహం నిర్మించుకొన్న యాజమాన్యం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ శాంతులతో విలసిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.పలువురు స్థానిక నాయకులు, ఆత్మీయులు, బంధుమిత్రులు పాల్గొని గృహ యజమానికి అభినందనలు తెలిపారు. అతిథులందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆప్యాయంగా సత్కరించారు.కార్యక్రమంలో పాల్గొని తమను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా స్రవంతి రెడ్డి కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ వేడుకలో పాల్గొన్న ముఖ్య నేతలతో కలిసి గృహ ప్రాంగణంలో గ్రూప్ ఫోటోలు దిగి ఆనందం పంచుకున్నారు. ప్రాంతీయ ప్రముఖులందరూ ఒకే వేదికపై కలుసుకుని ఈ ఆనందకర ఘట్టాన్ని పంచుకోవడం విశేషంగా నిలిచింది. నరసింహులు యాదవ్ గృహ ప్రవేశ వేడుక అత్యంత వైభవంగా, జరిగింది ఈ కార్యక్రమం లో సందీప్ వారి స్నేహితులు బృందం పాల్గొన్నారు

## అధికారుల నిర్లక్ష్యం వార్డు సమస్యలు

*** ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ ముమ్మడి జయలక్ష్మి**
**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో):**



నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మౌలిక సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ ముమ్మడి జయలక్ష్మి ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12వ వార్డులో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని, వీధి దీపాలు వెలగక చీకటిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వార్డులో సర్కార్ తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు అడవిని తలపించే విధంగా పెరిగిపోయి దారికి అడ్డంగా ఉన్నాయని తెలిపారు. పాడుబడిన ఇళ్లు కూలిపోయి కంప చెట్లు మొలిచి పాములకు ఆవాసంగా మారాయని, దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా కత్తా రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని, ఆ దారి గుండా నడవలేని పరిస్థితి ఉందని, వెంటనే సీసీ రోడ్డు వేయాలని కోరారు. మురుగునీరు రోడ్లపై, ఇళ్ల మధ్యలో పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని, చెత్తను ఎత్తడానికి కూడా మున్సిపల్ సిబ్బందిని 12వ వార్డుకు పంపడం లేదని ఆరోపించారు.తాను కౌన్సిలర్ గా ఎన్నికైన నాటి నుంచి వార్డు సమస్యలను పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, కలిసి ప్రస్తావిస్తే నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఫిర్యాదుకే దిక్కులేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వెంటనే అధికారులను 12వ వార్డుకు పంపి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో వార్డు ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదులో హెచ్చరించారు.

## ప్రజల ఫిర్యాదులు తక్షణ స్పందన

**నాగర్‌కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 07, (వుదయం ప్రతినిధి):**

*** ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు**
*** స్పందించిన అధికారులు**
*** త్వరితగతిన సమస్యల పరిష్కారం**

మండల కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం మూడు ఫిర్యాదులు అందినట్లు సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ప్రజావాణిలో బీఆర్ఎస్ శ్రేతల ఫిర్యాదు



**వెల్దండ సెప్టెంబర్ 7 (వు దయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ అధిష్టానం కేటీఆర్ పిలుపు మేరకు బిఆర్ ఎస్ పార్టీ మండల మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయం వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కెసిఆర్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి పాలన రాష్ట్రానికి శాపంగా మారిందని రైతులు,, మహిళలు, విద్యార్థులు, నష్టపోయారని ఆరోపించారు హామీలు నెరవేర్చే దాకా బిఆర్ ఎస్ ఉద్యమం ఆగదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జంగిలి నిరంజన్, కానుగుల జోగయ్య, ముక్తాల శేఖర్, హనుమంతు నాయక్, గండికోట రాజు, ఆనంద్, ప్రవీణ్, నిరంజన్, లింగం, అశోక్ తోపాటు పలువురు పాల్గొన్నారు

## పరిశుభ్రతలో నిర్లక్ష్యం - చర్యలు

*** అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**
**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 7(వుదయం ప్రతినిధి)**



పాఠశాలల ఆవరణలో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు.సోమవారం మహబూబ్ నగర్‌లోని మాడ్రన్ పాఠశాలను ఆయన మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్(ఎంఈఓ)తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదుల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించారు.పాఠశాలలో పారిశుధ్య పరిస్థితులపై అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అజాగ్రత్త వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎం.ఈ.ఓను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, నిర్లక్ష్యం వహించే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.

## సౌండ్ సిస్టమ్ వినియోగంపై హెచ్చరిక



**అయిజ సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించే నిర్వాహకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం డీజే సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లందరికీ అవగాహన కల్పిస్తూ, డీజే సౌండ్ సిస్టమ్‌ల నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని అయిజ ఎస్ ఐ గురుస్వామి స్పష్టం చేశారు.అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అయిజ ఎస్ ఐ డీజే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## ప్రజావాణి ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలి



*** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో)**

ప్రజావాణికి వచ్చే ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్‌లతో కలిసి ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణికి 34 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో 98, మండల స్థాయిలో 247 ఆర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, చీఫ్ సెక్రటరీ స్థాయిలోనూ సమీక్ష జరుగుతున్నందున అధికారులు అలసత్వం వహించరాదని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్న నేపథ్యంలో ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**వనపర్తి సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించి ఫిర్యాదు దారునికి సమాచార ఇవ్వాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎన్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ ఐ డి ఓ సి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 34 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 4 దరఖాస్తు వచ్చింది కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, జెడ్పి సీఈవో యాదయ్య, ఎ.ఒ భాను ప్రకాష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పి ఏ సి ఎస్ లపై 'నామినేటెడ్' పెత్తనం వద్దు!

*** ఎన్నికలు నిర్వహించాల్సిందే..**
**ప్రభుత్వానికి పి ఏ సి ఎస్ చైర్మన్ల సవాల్**
**గద్వాల సెప్టెంబర్ 07 (వుదయం కరస్పాండెంట్)**



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించకుండా, చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించి రైతుల ద్వారా పాలకవర్గాలను ఎన్నుకోవాలని ఉమ్మడి పాలమూరు జిల్లా పి ఏ సి ఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని పి ఏ సి ఎస్ చైర్మన్లు, సొసైటీ సభ్యులైన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాలపై ప్రభుత్వ జోక్యం పరిమితంగా ఉండాలనే ఉద్దేశంతో వైద్యనాథన్ కమిషన్ పలు సంస్కరణలను సూచించిందన్నారు. అయినప్పటికీ ఎన్నికలకు బదులుగా నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేయడం సహకార స్ఫూర్తికి విరుద్ధమన్నారు.రైతుల సొసైటీలకు ఎన్నికలు ఎందుకు నిర్వహించరు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సొసైటీల నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలను ఆయా సంఘాలే భరిస్తున్నప్పుడు ప్రభుత్వ జోక్యంతో నామినేటెడ్ పాలకవర్గాలను నియమించడం సరికాదన్నారు.
గతంలో రాష్ట్రంలోని 908 సహకార సంఘాల పాలకవర్గాలను తొలగించి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించగా, దీనిపై సొసైటీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయని తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం పాలకవర్గాలను తిరిగి నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ నామినేటెడ్ విధానంలో పాలకవర్గాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తగ్గి పి ఏ సి ఎస్ లకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులను జిల్లా కలెక్టర్ ద్వారా కోరారు.కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి వడ్డేపల్లి, పి ఏ సి ఎస్ చైర్మన్లు, సొసైటీ సభ్యులైన రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారం

*** ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలి అదనపు కలెక్టర్ పాండు**
**సంగారెడ్డి, సెప్టెంబర్ 07:--వుదయం.**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రధానంగా హాస్టల్స్ అడ్మిషన్లు, హౌసింగ్, పౌర సరఫరాలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు వస్తున్నాయని, ఆయా శాఖల అధికారులు వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో జిల్లావ్యాప్తంగా మొత్తం 80 ఫిర్యాదులు, వినతులు అందాయని అధికారులు తెలిపారు. ఇందులో కలెక్టరేట్‌లో 50, సంగారెడ్డి డివిజన్‌లో 24, జహీరాబాద్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్ డివిజన్‌లో 1 ఫిర్యాదు, వినతి అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి చౌటకూర్, గుమ్మడిదల, హత్నూర, ఝరాసంగం, జిన్నారం, కల్హేర్, కంది, కంగ్టి, కోహీర్, కొండాపూర్, మనూర్, మొగుడంపల్లి, మునిపల్లి, నాగలిగిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, న్యాల్కల్, పటాన్‌చెరు, పుల్కల్, రాయికోడ్, సదాశివపేట, సిర్గాపూర్, వట్టిపల్లి, కు మొత్తం 317 ఫిర్యాదులు, వినతులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, మిషన్ భగీరథ, నీటిపారుదల, ఆర్ సి ఓ ఎస్సీ, ఎస్టీ, బీసీ , మున్సిపల్, విద్య, పౌర సరఫరాలు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వక్ఫ్ బోర్డు తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

*** తాడూరు ప్రజావాణిలో కెవిపిఎస్, దళిత సంఘాల నిరసన**
**తాడూరు, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాడూరు మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమంలో కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ పై హమారా ప్రసాద్ ఉద్దేశపూర్వకంగా దళిత, బహుజనుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడం ఖండించదగ్గ విషయమన్నారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న అతడిని వెంటనే అరెస్టు చేసి దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు డీలర్ చంద్రయ్య, పరశురామ్, కృష్ణయ్య, వార్డు సభ్యుడు శరత్, రాములు, చంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో కళ్యాణి మల్లాదికి పీహెచ్.డీ.

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కళ్యాణి మల్లాది డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కొత్త పైరిమిడిన్ ఆధారిత కార్బోసైక్లిక్ న్యూక్లియోసైడ్, ఫ్యూజ్డ్ హెటెరోసైక్లిక్ ఉత్పన్నాలు: సంశ్లేషణ, ఇన్‌సిలికో, మధుమేహ నిరోధక, సూక్ష్మక్రిమి నిరోధక మూల్యాంకనం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సిద్ధాంత వ్యాసం, మధుమేహ నిరోధక, సూక్ష్మ జీవ నిరోధక అనువర్తనాలకు సంభావ్యత ఉన్న నూతన పిరిమిడిన్‌ఆధారిత సమ్మేళనాల అభివృద్ధిని అన్వేషిస్తుందని తెలియజేశారు. ఈ అధ్యయనం అనేక ఆశాజనకమైన □-గ్లూకోసిడేస్ నిరోధకాలను గుర్తించిందన్నారు. వీటిలో ఎంపిక చేసిన సమ్మేళనాలు బలమైన నిరోధక చర్యను, అనుకూలమైన మాలిక్యులర్‌డాకింగ్ ప్రొఫైల్స్‌ను, గణనీయమైన యాంటీ బాక్టీరియల్ చర్యను, ఆశాజనకమైన డ్రగ్ లైక్ నెస్, ఏడీఎంఈ, టాక్సిసిటీ లక్షణాలను ప్రదర్శించినట్టు తెలిపారు. మధుమేహం, సూక్ష్మజీవుల సంక్రమణలకు సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన చికిత్సా అభ్యర్థుల కోసం జరుగుతున్న అన్వేషణకు ఈ పరిశోధన దోహదపడుతుందని వివరించారు.డాక్టర్ కళ్యాణి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పరిశోధనకు ఆమె చేసి గణనీయమై కృషిని అభినందించినట్టు తెలిపారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకిత భావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు ప్రొఫెసర్ రాంబాబు గుండ్లను కూడా ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

*** రెండు రోజుల్లో మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలోని వారికి నోటీసులు ఇవ్వాలి**
*** కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల, సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో)**




ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను వేగవంతం చేసి పారదర్శకమైన, సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లందరికీ రెండు రోజుల్లో నోటీసుల అందజేత ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.
సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గద్వాల ఐడీఓసీ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 1,49,282 నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటి వరకు దాదాపు 80 శాతం ఓటర్లకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. ఏఈఆర్ఓలు ప్రతిరోజూ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏ, బీ, సీ కేటగిరీల వారీగా నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించేలా బీఎల్ఏల సహకారం తీసుకోవాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్దేశిత సమయంలోగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రీసర్వే చేయాల్సిన గ్రామాలపై స్పష్టతతో ముందుకు వెళ్లాలని, ఇప్పటికే శిక్షణ పొందిన సర్వేయర్లు నిబంధనల ప్రకారం పని చేయాలని సూచించారు. అవసరమైన చోట లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించు కోవాలని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను కూడా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దుశ్శాసన పాలన కొనసాగుతుంది....

**- శివ్వంపేట లో బి ఆర్ ఎస్ నాయకుల ధర్నా....**
**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 7....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సున్నితా లక్ష్మారెడ్డి కి జరిగిన అవమానానికి మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ . జిల్లా మాజీ ఎంపీపీలపోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ. మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ . వివిధ గ్రామాల నాయకులతో కలిసి రాస్తా రోకో నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుశ్శాసన పాలనల కొనసాగుతుందని. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కి నేడు అసెంబ్లీ బయట జరిగిన అవమానానికి నిదర్శనం ఈ పరిపాలన అని వారు మండిపడ్డారు. 420 హామీలు ఇచ్చి ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం ప్రజలను నిలువునా దోపిడీ చేస్తుందని మాయమాటలతో మభ్యపెడుతు పబ్బం గడుపుతుందని . యూరియాకు యాపులు. విద్యుత్ సరఫరా సరిగా ఉండదు. వృద్ధులకు 4000పెన్షన్ ఇయ్యరు. వికలాంగులకు 6000పెన్షన్ ఇయ్యరు. స్త్రీలకు 2500 ఇయ్యరు. రైతులకు రైతు బీమా కట్టు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో మోసాలు చేస్తున్నారని ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని రైతులను మోసం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజల పట్ల పోరాటం చేస్తే ఈ విధంగా పోలీసులను పెట్టి అరెస్టులు చేసి కేసులు పెడతారా అంటూ వారు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మీ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోవాలని మండిపడ్డారు. వివిధ గ్రామాల సర్పంచులు ప్రవీణ్ గౌడ్. రాజు. నరసయ్య. నారాయణరావు. కొమరయ్య. నాయకులు హనుమంత్ రెడ్డి. మహేందర్ రెడ్డి. యాద గౌడ్. కృష్ణారావు. నరేందర్. సత్యం. ముత్యాలు. రామ చంద్ర గౌడ్. తిమ్మాపూర్ ఉప సర్పంచ్ శ్రావణి ప్రవీణ్ గౌడ్. ఆంజనేయులు. పాపయ్య. కొండల్. శ్రీశైలం యాదవ్. కిషన్. నర్సింగరావు. వివిధ గ్రామాల నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 07 (వుదయం న్యూస్) : '**
అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై, మహిళా ఎమ్మెల్యేలపై చేసిన దాడిని నిరసనగా సోమవారం పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ అనిల్ కుమార్ కి ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, కౌన్సిలర్లు పెట్టం తిరుపతి, ఎగ్గడి జమున కుమార్, గడిగోప్పల సతీష్, ఆసాడి పురుషోత్తం, మోట పలుకుల శ్రీనివాస్, గరిసే రవీందర్, గొల్ల మనోహర్, అంకతి గంగాధర్, దండేపల్లి మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, దండేపల్లి, లక్షెటిపేట కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షునిగా చెట్ల రమేష్



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 07 (వుదయం న్యూస్):**
లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ ను సభ్యుల సమక్షంలో సోమవారం, నూతన సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెట్ల రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతి సంతోష్ ను ఉపాధ్యక్షులుగా కందుల రమేష్, కొండపల్లి ప్రశాంత్ జాయింట్ సెక్రెటరీ,నూతి అనిల్,కందుల సతీష్ , క్యాషియర్ గా పారవెల్లి శ్రీనివాస్ ముఖ్య సలహాదారులుగా వై శ్రీనివాస్, ఆకుల కిరణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మాట్లాడుతూ.. లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అభివృద్ధికి ముందుంటానని పాత్రికేయుల సమస్యలు పరిష్కరించడానికి ముందుండి కృషి చేస్తానని అదేవిధంగా ప్రభుత్వం నుండి వచ్చే పాత్రికేయుల హక్కులను పథకాలను అందేలా కృషి చేస్తానని తెలిపారు.

## జన్నారం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**జన్నారం సెప్టెంబర్ 7 (వుదయం విలేఖరి)**
జన్నారం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులుగా గొనె ప్రభాకర్ మాదిగ, అధికార ప్రతినిధిగా కొండూకురి ప్రశాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దుమల్ల ప్రవీణ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా ఉపారపు శేఖర్ మాదిగ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి కొండుకూరి ప్రభుదాస్ మాదిగ,జిల్లా నాయకులు మామిడిపెల్లి ఇందయ్య మాదిగ,దుమల్ల రమేష్ మాదిగ,సత్యనారాయణ మాదిగ, మంద రాజేష్ మాదిగ,దుమల్ల ఎల్లయ్య మాదిగ,కత్తెరపాక రాజేష్ మాదిగ,సీనియర్ నాయకులు
తదితరులు పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



**బీఆర్ఎస్ నేతల డిమాండ్**
**నాగిరెడ్డిపేట్,వుదయం**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నాగిరెడ్డిపేట్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు గడిచినా అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తే మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య,
గోపాల్‌పేట్ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్, మంగలి యాదగిరి, మోతే శ్రీనివాస్, వెంకట్రాంరెడ్డి, వాడి సర్పంచ్ మహేందర్, హనుమంత్‌రెడ్డి, ఎండీ ఫరీద్, మిద్దె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్న సాదు రాజేందర్

**జన్నారం,సెప్టెంబర్ 7 (వుదయం విలేఖరి)**
జన్నారం పట్టణానికి చెందిన సాధు రాజేందర్ ఇంపాక్ట్ క్లబ్ ట్రైన్ ది ట్రైనర్ వర్కుషాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్నారు.ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ రీజన్19 నిర్మల్ అధ్యక్షులు లక్ష్మణ్ వాడేకర్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ వర్కుషాప్ 2.0 బ్యాచ్ 290 రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.జాతీయ స్థాయి ట్రైనర్స్,కోచెస్ మరియు స్పీకర్స్ గా ఉదయ భాస్కర్,ఐసీఐ జేవీపీ రవికుమార్, హెడ్ బోర్డు మెంబర్ శ్యామ్ రాథోడ్, కోచ్ రామచంద్రుడు,మమత తదితరులు పాల్గొని శిక్షణార్థులకు విలువైన మార్గదర్శకత్వం అందించారు.ఇంపాక్ట్ ట్రైనర్స్ కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ రెండు రోజుల వర్క్ షాప్ లో రాజేందర్ సాధు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సర్టిఫైడ్ ట్రైనర్ గా గుర్తింపు పొందడంతో పాటు బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు ను కూడా అందుకున్నారు.



ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు,మెంటర్స్, కోచెస్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రదర్శించిన ప్రతిభ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు శిక్షణ పట్ల చూపిన అంకితభావాన్ని పలువురు ప్రశంసించారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ,రాబోయే రోజుల్లో తాను మరింత సమర్థవంతమైన ట్రైనర్ గా, స్పీకర్ గా ఎదిగి యువతకు మరియు సమాజానికి తన వంతు బాధ్యతలను నిర్వర్తించడమే తన ప్రధాన ఆశయమని తెలిపారు. యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు తన సేవలను అందిస్తానని పేర్కొన్నారు.సర్టిఫైడ్ ట్రైనర్ గా మరియు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు గ్రహీతగా ఆయన సాధించిన ఈ ఘనత పట్ల పలువురు ప్రముఖులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

- **రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు.. ఘనంగా అన్నదానం**

**నిజాంసాగర్ సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):**
పిట్లం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ఆలయంలో గౌరీ గణపతి పూజ, పుణ్యావచనం, అగ్ని ప్రజ్వలనతో పాటు రుద్ర హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్ శర్మ, తేజ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,



తీర్థప్రసాదాలు స్వీకరించారు.
శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. కొండాపూర్ సంగ్రామ్ మహారాజ్, దేవిదాస్ మహారాజ్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో భక్తి గీతాలు,
వేద మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రావణ మాసంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## భారత్ జోడో యాత్రకు నాలుగేళ్లు

- **సంబరాల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన చారిత్రాత్మక భారత్ జోడో యాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ పాల్గొన్నారు.కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐసీసీ ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, పీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం శేఖర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపుగా నిలిచిందన్నారు. ప్రజలను కలుపుతూ, వారి సమస్యలను నేరుగా



తెలుసుకుంటూ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.భారత్ జోడో యాత్ర కేవలం రాజకీయ యాత్ర కాదని, దేశ ప్రజలను ఐక్యం చేసే గొప్ప ఉద్యమమని అన్నారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలందరినీ కలుపుతూ రాహుల్ గాంధీ ముందుకు సాగారని తెలిపారు. యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ

- **ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన యూనిఫామ్‌లు**

**నాగిరెడ్డిపేట్,వుదయం**
మండలంలోని మెల్లకుంట తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను గ్రామ సర్పంచ్ బాల్య చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మంచి నాణ్యతతో కూడిన ఏకరూప దుస్తులను అందించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామావత్ వాసురం, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్ర వాసురం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వర్జ నాయక్, వార్డు సభ్యుడు అంగోత్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైలులో నిషేధిత గడ్డి మందు స్వాధీనం



**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**
కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రామగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రామగిరి ఎక్స్‌ప్రెస్ (17004) రైలులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్2లో నిర్వహించిన తనిఖీల్లో 81 గడ్డి మందు ప్యాకెట్లు, 5 లీటర్ల చొప్పున ఐదు క్యాన్లు, ఒక లీటర్ చొప్పున ఐదు క్యాన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న నిషేధిత గడ్డి మందును కాగజ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణకు అప్పగించారు.తనిఖీల్లో కాగజ్‌నగర్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఐ కుమారి ప్రాచీ దేవి, ఏఎస్ఐ ఆర్. దాసు, సిబ్బంది కమలేష్ కుమార్ సింగ్,
ప్రేమానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైలులో అక్రమంగా నిషేధిత మందుల తరలింపుపై ఆర్పీఎఫ్ అధికారులు నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి) , సెప్టెంబర్ 7:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, నోటీసుల జారీని వేగవంతం చేయాలని ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు డా. యోగితా రాణా అధికారులను ఆదేశించారు.
సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తదితర అధికారులతో కలిసి తహసిల్దార్లతో హియరింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. మ్యాపింగ్ కాని,

అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు త్వరగా నోటీసులు అందించి, 100 శాతం హియరింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలను అదే రోజు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో హియరింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో SIR ప్రక్రియను పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.






## సర్ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్ బక్కయ్య

**జన్నారం,సెప్టెంబర్ 7 (వుదయం విలేఖరి)**
ఓటర్ నమోదు సవరణలో భాగంగా పొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సర్ ప్రక్రియను తహసిల్దార్ బక్కయ్య సోమవారం పరిశీలించారు.
సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి వారి ఓటు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.
ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్,ఉప సర్పంచ్ అప్పల జలపతి,ఈఓ రాహుల్,ఆర్ఐ వెంకటేష్,వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## జప్తి జాన్కంపల్లిలో ఆరోగ్య శిబిరం



- **వాతావరణ మార్పులతో వ్యాధులపై అప్రమత్తత అవసరం**

**నాగిరెడ్డిపేట,వుదయం**
వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జప్తి జాన్కంపల్లి సర్పంచ్ వర్షిణిపరమేశ్వర్ సూచించారు. సోమవారం నాగిరెడ్డిపేట్ మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను అందజేశారు.
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, జ్వరాలు, ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామస్తులు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి లావణ్య,పంచాయతీ కార్యదర్శి శంకర్, ఏఎన్ఎం యమునా, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో మోదీ చిత్రపటం పెట్టాలి



- **బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్**

**నాగిరెడ్డిపేట్,వుదయం**
నాగిరెడ్డిపేట్ మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో ప్రధాని చిత్రపటం ఏర్పాటు చేయకపోవడం సముచితం కాదన్నారు. దేశ ప్రధానిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి ఉందని పేర్కొన్నారు. ప్రధాని చిత్రపటం లేకపోవడం ఆయనను అవమానించడమేనని బీజేపీ భావిస్తోందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమాన్లు, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజగౌడ్, నాయకులు విష్ణువర్ధన్, రాజు,అంజయ్య,మల్లేష్,భార్గవ్,సిద్ధిరములు, గోపాల్,పవన్,మణికంఠ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ జోన్ రద్దు చేయాలంటూ ఎఫ్డీఓ కు వినతి



**జన్నారం,సెప్టెంబర్ 7 (వుదయం విలేకరి)**
టైగర్ జోన్ ను వెంటనే రద్దు చేసి, ఈకో సెన్సిటివ్ జోన్ ను పూర్తిగా ఎత్తివేయాలని కోరుతూ సోమవారం రోజున సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012 సంవత్సరం నుండి కవ్వాల్ అడవులలో పులి జాడ లేకపోయినా, టైగర్ జోన్ ఏర్పాటు చేసిన నాటి నుండి తాము నానా రకాల ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని 2012 నుండే ఎన్టీసీఏ కి మరియు అటవీ శాఖకు తెలిసిన విషయమేనని అన్నారు. కవ్వాల్ అభయారణ్యం అంతా టేకు మరియు ఇతర వృక్షాలతో నిండి వాతావరణం వేడెక్కి, నీటి సౌకర్యం లేకపోవడంతో పులులకు ఆవాసయోగ్యం కాదన్నది అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు
.కావున టైగర్ జోన్ ను 2047 వరకు పొడిగించకుండా, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 లోని సెక్షన్ 38 W (2) ప్రకారం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెంటనే టైగర్ జోన్ ను రద్దు చేసి,ఈకో సెన్సిటివ్ జోన్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.వినతి పత్రం అందజేసిన వారిలో సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాములు భూమా చారి,గోలి చందు,కొండపల్లి మహేష్‌లు ఉన్నారు.

# చక్కని ఆరోగ్యం

## పిల్లలు తగినంత బరువు లేకపోతే..!



అధిక బరువు వల్ల ఎలాగైతే వివిధ ఆరోగ్య సమస్యలు వస్తాయో.. అలాగే బరువు తక్కువగా ఉండడం వల్ల కూడా వెంటాడే ఆరోగ్య సమస్యలు బోలెడుంటాయి. ఇది కేవలం పెద్ద వాళ్లకే కాదు.. పిల్లలకీ వర్తిస్తుంది. చాలామంది తల్లి దండ్రులు వారి బుజ్జాయిల బరువు గురించి బాధపడుతూ ఉంటారు. ఈ క్రమంలో – వారిని ఓసారి పోషకాహార నిపుణులకు చూపించి, వారు సూచించిన సలహాలను క్రమం తప్పకుండా పాటించాలి. ఈ నేపథ్యంలో – మరీ తక్కువ బరువున్న పిల్లలు బరువు పెరగాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.

కొంతమంది తల్లులు పిల్లలు బరువు తక్కువగా ఉన్నారని టెన్షన్ పడుతూ.. వాళ్లకు ఎలాగైనా ఆహారం తినిపించాలని నిర్ణయించుకుని బలవంతంగా తినిపిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తినే ఆహారంపై వారికి ఆసక్తి తగ్గే అవకాశం ఉంటుంది. పైగా ఈ పద్ధతి వల్ల వారు తినకుండా మరింత మొండికేస్తుంటారు. దీనివల్ల వారికి అందాల్సిన పోషకాలు పూర్తిగా అందకుండా పోతాయి. కాబట్టి పిల్లల్ని ఆహారం విషయంలో బలవంతపెట్టకుండా.. వారి ఇష్టాయిష్టాలను దృష్టిలో పెట్టుకుని ఏ పదార్థాలు, స్నాక్స్ ఇవ్వాలో ఓ ప్రణాళిక తయారు చేయాలి. దాని ప్రకారం వారికి పోషకాహారం అందించాలి. ఫలితంగా వారికి కావాల్సిన పోషకాలు అంది.. శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కొంతమంది పిల్లలు టీవీ/ఫోన్ చూస్తూ భోజనం చేస్తుంటారు. అయితే ఇలా తినడం వల్ల వారి ధ్యాసంతా ఆహారం మీద కంటే వాటి మీదే ఎక్కువగా ఉంటుంది. దీంతో ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం? అనే విషయాలేవీ వారు పట్టించుకోరు. దీనివల్ల ఆయా పోషకాలు శరీరానికి అందవని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి పిల్లలు తినే సమయంలో టీవీ ఆఫ్ చేసేయడం, మొబైల్స్, కంప్యూటర్, ల్యాప్‌టాప్స్.. వంటి గ్యాడ్జెట్లను దూరంగా ఉంచడం.. మర్చిపోకూడదు. అలాగే వీటి పైకి మనసు మళ్లకుండా ఉండాలంటే తల్లిదండ్రులు పక్కనే కూర్చొని పిల్లలు తినే ఆహార పదార్థాలపై వారికి అవగాహన కల్పించాలి. దానికి తగినట్టుగానే ఆహారం రంగు, రుచి, వాసన ఉండేలా చూసుకోవాలి. తద్వారా వారిలో ఆహారం పట్ల ఆసక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు. పిల్లలు వయసుకు తగ్గ బరువుండాలంటే.. వివిధ పోషకాలు లభించే పండ్లు, కూరగాయల్ని వారి రోజువారీ ఆహారంలో భాగం చేయాలి. దీనిపై సరైన అవగాహన లేకపోతే సంబంధిత పోషకాహార నిపుణులను సంప్రదించి వారు సూచించే ఆహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందివ్వాలి.

వయసు, ఎత్తు.. వంటివి ఆధారంగా బరువును నిర్ణయిస్తారు. కాబట్టి ముందుగా నిపుణులను సంప్రదించి వారి ఎత్తు, వయసు ప్రకారం వారు ఎంత బరువుండాలో తెలుసుకోవాలి. తర్వాత వారు అందించే సూచనలు పాటిస్తూ పిల్లల బరువును క్రమంగా పెంచాలి. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు వారు ఎంత బరువు పెరుగుతున్నారు? ఒకవేళ ఉండాల్సిన దానికంటే బరువు ఎక్కువైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. తక్కువైతే పెంచాల్సిన మార్గాలు.. వంటి విషయాలన్నింటిపై తల్లిదండ్రులకు మంచి అవగాహన ఉంటే మంచిది. కాబట్టి వారు సరైన బరువుండాలంటే ఇలా ఎప్పటికప్పుడు వారి బరువును చెక్ చేస్తూ తగిన జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెబుతున్నారు.

## పొట్టపైన దురద.. ఉపశమనమిలా..!



గర్భం ధరించాక శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. కడుపులో బిడ్డ ఎదుగుతున్న కొద్దీ పొట్ట పెరగడం కూడా ఇందులో ఒకటి. అయితే ఇలా చర్మం సాగే క్రమంలో దురద పెట్టడం సహజం. అలాగని ఆ ప్రదేశంలో గోకడం వంటివి చేస్తే చర్మం గీరుకుపోయి మచ్చలు ఏర్పడతాయి. అందుకే పొట్ట పెరుగుతున్నా దురద రాకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. శరీరం తేమను కోల్పోయినా దాని ప్రభావం చర్మంపై పడుతుంది. అది పొడిబారి దురద పెడుతుంటుంది. అందుకే గర్భిణిగా ఉన్నప్పుడు తగినన్ని నీళ్లు తాగడం మంచిది. ఫలితంగా చర్మం తేమగా ఉండి దురద సమస్య తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. చర్మం పొడిబారకుండా చేయడంలో మాయిశ్చరైజర్ పాత్ర కూడా కీలకమే! అందుకే నిపుణుల సలహా మేరకు.. సువాసన రహిత మాయిశ్చరైజర్లను పొట్టకు అప్లై చేసుకోవడం మంచిదట. గర్భిణిగా ఉన్న సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం, వాటి రాపిడి వల్ల కూడా పొట్ట వద్ద చర్మం దురద పెడుతుంటుంది. అందుకే ఈ సమయంలో వదులుగా, శరీరానికి గాలి తగిలేలా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా దురద పెట్టకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. కొంత మంది ఏ కాలంలోనైనా వేడి నీటితో స్నానం చేస్తుంటారు. దీనివల్ల కూడా చర్మం పొడిబారిపోయి దురద పెట్టే అవకాశాలు ఎక్కువ. అందుకే గోరువెచ్చటి నీళ్లను స్నానానికి ఉపయోగించడం మంచిదంటున్నారు.

అలాగే స్నానానికి ఉపయోగించే సబ్బులు, బాడీ వాష్‌లు.. గాఢత తక్కువగా ఉన్నవి, పరిమళ భరితం కానివి ఎంచుకోవాలంటున్నారు నిపుణులు. పెరిగే పొట్టపై స్ట్రెచ్ మార్క్స్ పడకుండా, దురద పెట్టకుండా.. కొన్ని రకాల క్రీమ్స్, నూనెలు దోహదం చేస్తాయి. వాటిని నిపుణుల సలహా మేరకు వాడడం ఉత్తమం. పొట్ట పెరుగుతున్న కొద్దీ సాగుతున్న చర్మం దురద పెట్టకుండా ఉండాలంటే.. స్నానం చేశాక.. కాస్త కలబంద గుజ్జు లేదంటే కొబ్బరి నూనెను అప్లై చేసుకున్నా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

## జుట్టు విషయంలో.. ఈ జాగ్రత్తలు!



ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్రపోయే వరకు సమయంతో ఉరుకులు, పరుగులు పెడుతూనే ఉంటాం. ఈ క్రమంలో కొంతమంది తలస్నానం చేసి వచ్చిన వెంటనే తొందరగా ఆరిపోవాలని డ్రయర్స్ ఉపయోగిస్తూ ఉంటారు. అది జుట్టుని మరింత పొడిబారిపోయేలా చేస్తుంది అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో – జుట్టు విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

డ్రయర్స్ వాడడమే కాదు.. తలస్నానం చేసి వచ్చిన వెంటనే టవల్‌తో గట్టిగా రుద్దేయడం కూడా పొరపాటేనట. దీనివల్ల జుట్టు చిక్కులు పడి, మరింత ఎక్కువగా ఊడిపోయే అవకాశం ఉంటుందట. అలాగే కొందరు జుట్టు తడిగా ఉన్నప్పుడే దువ్వుకుని, జడ వేసేసుకుంటూ ఉంటారు. ఇలా చేస్తే బలహీనంగా ఉన్న కుదుళ్ల నుంచి వెంట్రుకలు ఊడిపోయే అవకాశం ఉంటుందట. అంతేకాకుండా తల పూర్తిగా ఆరకపోతే కాస్త ఇబ్బందిగా కూడా ఉంటుంది.

శిరోజాలకు సంబంధించిన కొన్ని ఉత్పత్తులను జుట్టు తడిగా ఉన్నప్పుడు అప్లై చేయకూడదు అంటున్నారు నిపుణులు. అలాగే తల నుంచి సువాసన రావాలని హెయిర్ స్ప్రేలను ఉపయోగిస్తూ ఉంటాం. వాటిని నేరుగా తల మీద స్ప్రే చేయకూడదు. వాటిలోని రసాయనాలు, ఆల్కహాల్ జుట్టుపై ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. అందుకే చేతుల్లో స్ప్రే చేసుకుని తర్వాత జుట్టుకి రాసుకోవాలి అని సూచిస్తున్నారు.

## వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా..!



కొంత మందికి చిన్నవయసులోనే ముఖంపై ముడతలు పడుతుంటాయి. దీంతో వయసు తక్కువే అయినా ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. మరి ఈ సమస్యను తగ్గించుకోవడానికి ఏవేవో క్రీములు రాయడం, చికిత్సలు చేయించుకోవడం వంటివి చేస్తుంటారు. అయితే ముందు నుంచే చక్కటి పోషకాహారం తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా నివారించవచ్చు అంటున్నారు నిపుణులు.

చర్మ సౌందర్యానికి ఉపయోగపడే పాలీఫినోల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు.. మొదలైనవి బ్లూబెర్రీ పండ్లలో అధికంగా లభిస్తాయి. ఇవి ఫ్రీరాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే కొత్త చర్మకణాలను ఉత్పత్తి చేయడంలోనూ ఇవి సహాయపడతాయి. ఫలితంగా చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా జాగ్రత్తపడచ్చు అంటున్నారు నిపుణులు. టమాటాల్లో ఉండే లైకోపీన్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తుంది. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రక్తప్రసరణ సజావుగా జరిగి చర్మానికి మెరుపు వస్తుందట.

తేనెలో ఉండే ఔషధ గుణాలు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో సహాయపడతాయి. అందుకే తేనెను ఇంట్లో సహజసిద్ధంగా తయారు చేసుకునే ఫేస్‌మాస్కులలో ఉపయోగిస్తారని చెబుతున్నారు నిపుణులు. కొన్ని సందర్భాల్లో చర్మం ఎర్రగా మారడం, దద్దుర్లు రావడం జరుగుతుంది. ఇలాంటి సమస్యల్ని తగ్గించుకోవడానికి పెరుగులో ఉండే ప్రొబయాటిక్స్ తోడ్పడతాయి అంటున్నారు నిపుణులు.

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే గ్రీన్ టీ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుందంటున్నారు.

చర్మం యవ్వనంగా కనిపించాలంటే మన శరీరంలో నీటి శాతం తగినంత ఉండాలి. కాబట్టి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి. వీటితో పాటు యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఇతర పండ్లు, కూరగాయల్ని తినడం అలవాటు చేసుకోవడం వల్ల చిన్నవయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా నివారించుకోవచ్చు అని సూచిస్తున్నారు నిపుణులు.

## వర్షంలో తడిస్తే...



అమ్మాయిలకు కురులపై శ్రద్ధ కాస్త ఎక్కువే కదా! మామూలుగానే జుట్టురాలడాన్ని తట్టుకోలేం. ఇక, వర్షాకాలం వచ్చిందంటే ఆ సమస్య ఇంకా ఎక్కువవుతుంది. అందుకు నిపుణులు సూచించే పరిష్కారాలేంటో చూద్దామా... ఎంత తప్పించుకుందామనుకున్నా ఏదో ఒక సందర్భంలో మనం వర్షంలో తడవడం ఖాయం! దానికి చెమట, కాలుష్యం అదనం. ఇవన్నీ తలని జిడ్డుగా మారుస్తాయి. దురద, చుండ్రూ వస్తాయి. జుట్టూ రాలిపోతుంది. అందుకే, వారంలో కనీసం రెండుసార్లు అయినా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలంటుకోవాలి. కాటన్ లేదా మైక్రోఫైబర్ టవల్‌ని ఉపయోగించి కుదుళ్లను ఆరబెట్టాలి. అవసరమైతే, హెయిర్ డ్రైయర్‌ను కూల్ సెట్టింగ్‌లో పెట్టి కూడా ఉపయోగించవచ్చు. అంతేకాదు, ఎక్కువ రసాయనాలు ఉండే క్రీములు, వ్యాక్స్‌లు, జెల్‌లను పూయడమూ జుట్టు ఆరోగ్యానికి చేటు చేసేవే.

అందుకే, సహజంగా తేమనందించే కలబంద, టీ ట్రీ, హైలురోనిక్ యాసిడ్ వంటివి వాడుకోవచ్చు. నూనె కూడా జుట్టుకి మంచి కండిషనర్‌లా పనిచేస్తుంది. అయితే, ఎక్కువ సేపు ఉంచకూడదు. తలస్నానం చేయడానికి ఓ అరగంట ముందు రాసుకుని, తలంటుకుంటే సరి. అదనపు నీటిని సున్నితంగా తీసేసి, చిక్కుని విడదీయడానికి వెడల్పాటి పళ్ల దువ్వెన ఉపయోగించాలి. జుట్టు తడిగా ఉన్నప్పుడు గట్టిగా దువ్వకూడదు. బ్లో డ్రైయింగ్, స్ట్రెయిటెనింగ్ వంటివీ జుట్టురాలడాన్ని ఎక్కువ చేస్తాయి. కాబట్టి, వీడి వాడకాన్నీ తగ్గించాలి. ఇప్పటివరకూ చెప్పినవన్నీ మనం తీసుకునే బాహ్య సంరక్షణే. లోపలి నుంచి జుట్టు దృఢంగా ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారమూ ముఖ్యమే. అసలే వర్షాకాలం... వేడివేడిగా తిందామని వేయించిన, ప్రాసెస్ చేసిన చిరుతిళ్లు తింటే అవి జుట్టుపైనా ప్రభావాన్ని చూపిస్తాయి. అందుకే, ప్రొటీన్, ఐరన్, ఆకుకూరలతో కలగలిసిన సమతులాహారాన్ని తీసుకోవాలి. అది జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతుంది. పాటిస్తారా మరి...

## జిడ్డుకు చెక్ పెట్టాలంటే..!



ఏ కాలమైనా జిడ్డు చర్మంతో బాధపడే అమ్మాయిలు చాలామందే ఉంటారు. అయితే ఈ చర్మతత్వం మొటిమలు, మచ్చలకు కారణమవుతుంది. అందుకే కొన్ని ఇంటి చిట్కాలతో ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. పాలను ముఖానికి అప్లై చేసుకొని పావుగంటయ్యాక కడిగేసుకోవాలి. తద్వారా చర్మంపై జిడ్డుదనం తొలగుతుందట.

తేనెతోనూ ముఖంపై జిడ్డుదనాన్ని తొలగించచ్చు. ఇందుకోసం తేనెను ముఖానికి పూతలా వేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.


గుడ్డులోని తెల్లసొన, ద్రాక్షరసం, నిమ్మరసం.. ఈ మూడింటినీ కొద్ది మొత్తాల్లో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూసుకొని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. నిమ్మరసం సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది, గుడ్డులోని తెల్లసొన చర్మం బిగుతుగా మారడానికి, ద్రాక్షరసం చర్మం మృదువుగా మారడానికి ఉపకరిస్తాయట.

సాధారణంగా ఆయిలీ స్కిన్ ఉన్న వారు ఎక్కువ సార్లు ముఖం కడుక్కుంటూ ఉంటారు. ఇది మంచిది కాదు. ఎందుకంటే ఈ క్రమంలో పదే పదే సోప్ లేదా ఫేస్‌వాష్ వాడితే.. వాటిలో ఉండే రసాయనాలు చర్మాన్ని పొడిబారేలా చేస్తాయి. కాబట్టి సాధారణ నీటితో రోజుకు రెండు లేదా మూడుసార్లు ముఖం శుభ్రం చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

## కోమలమైన చర్మానికి..!

వాతావరణం ఎలా ఉన్నా సరే.. కొందరి చేతులు, కాళ్లు పొడిబారి పగులుతుంటాయి. ఇలాంటప్పుడు ఈ సింపుల్ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు.

కాళ్లు, చేతులపై మృతకణాలు పేరుకున్నప్పుడు కూడా చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే వాటిని తొలగించుకునేందుకు ఇంట్లో తయారుచేసుకునే కొన్ని ప్యాక్స్, స్క్రబ్స్ అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుంది. చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. రాత్రి పడుకునే ముందు కొబ్బరి



నూనెను చేతులు, కాళ్లు, పాదాలకు రాసుకొని మర్దన చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం తిరిగి మృదువుగా మారుతుందట. గోరువెచ్చని నీటిలో కొద్దిగా వంటసోడా, ఏదైనా కొన్ని చుక్కల అత్యవసర నూనెను వేయాలి. కొన్ని గులాబీ రేకలూ వేసుకోవచ్చు. ఇందులో చేతులు, కాళ్లను ఓ పది నిమిషాల పాటు ఉంచి తీసేయాలి. ఇలా చేయడం వల్ల కాళ్లు, చేతుల చర్మం మృదువుగా మారుతుందంటున్నారు నిపుణులు. గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో చేతులు, కాళ్లను కాసేపు ఉంచాలి. పది నిమిషాల తర్వాత బయటికి తీసి కడిగేసుకోవాలి. ఆ తర్వాత కొబ్బరి / లేదా బాదం నూనె రాసుకోవడం వల్ల ఆయా భాగాలకు తేమ అందుతుందట. అంతేకాదు.. రోజంతా నడవడం వల్ల వచ్చే అలసట కూడా తగ్గుతుందట. రాత్రి పడుకునే ముందు ఆలివ్ నూనెను కాళ్లు, చేతులకు రాసుకుని, మర్దన చేసుకున్నా మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

## అందానికి.. పసుపు నూనె!

అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి వివిధ రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ వాడడం మనకు అలవాటే! ఈ క్రమంలో పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన అత్యవసర నూనె వల్ల కూడా సౌందర్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..

సీబమ్ ఉత్పత్తి పెరగడం వల్ల చర్మంపై ఎక్కువ నూనె ఉత్పత్తై జిడ్డుగా మారుతుంది. తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధీకరించి.. జిడ్డుదనాన్ని తొలగించడంలో పసుపు నూనె కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా మొటిమల బెడద తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. చర్మానికి తేమనందించి పొడి చర్మ సమస్యను దూరం చేస్తాయట.

ఈ ఎసెన్షియల్ ఆయిల్ వల్ల చర్మానికే కాదు.. కురులకు కూడా చక్కని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. చుండ్రుని నివారించడంతో పాటు జుట్టు రాలడాన్ని అరికట్టడంలోనూ ఇది ఉపకరిస్తుందట. అలాగే దీనిలో యాంటీ ఫంగల్ గుణాలు ఉండడం వల్ల ఇవి కుదుళ్లలో ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయట. దీనికోసం ఈ నూనెను నేరుగా కాకుండా మనం ఉపయోగించే సాధారణ నూనె (కొబ్బరినూనె, బాదంనూనె..)లో కొన్ని చుక్కలు కలుపుకొని ఉపయోగించాలంటున్నారు నిపుణులు. ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. కాబట్టి వాపు నుంచి ఉపశమనం పొందడానికి కూడా ఈ ఆయిల్‌ను ఉపయోగించచ్చు.

పాదాల్లో పగుళ్లను తగ్గించడానికి కూడా ఇది బాగా ఉపకరిస్తుందట. దీనికోసం కొబ్బరినూనె లేదా ఆముదంలో రెండు చుక్కల పసుపు నూనె కలిపి ఆ మిశ్రమంతో రోజూ పాదాలను మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తక్కువ సమయంలోనే పగుళ్లు తగ్గడంతో పాటు పాదాలు మృదువుగా మారతాయట.



## ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల జోరు..

ఇండియన్ ఆటో రిటైల్ మార్కెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆగస్టులో సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు విక్రయాలు తొలిసారిగా.. పెట్రోల్ వాహనాల అమ్మకాల సంఖ్యను అధిగమించాయి. ఈ మూడు రకాల వాహనాలు.. ప్యాసింజర్ వెహికల్స్ విక్రయా ల్లో 41.95 శాతం వాటాను దక్కించుకున్నాయి. అదే సమయంలో పెట్రోల్ వాహనాల వాటా 40.85% శాతానికి పరిమితమైంది.గతేడాది ఆగస్టు నెలలో పెట్రోల్ వాహనాల వాటా 46 శాతంగా ఉండటం గమనార్హం. ఈ20 పెట్రోల్ వినియోగంపై నెలకొన్న సందేహాలు, ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవాలనే ఆలోచనతో ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మొగ్గుచూపుతున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.




# మళ్లీ ధరలు పెంచిన మారుతీ..




ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన వినియోగదారులకు మళ్లీ ధరల షాక్ ఇచ్చింది. ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.20 వేల వరకు ధరలను పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ముడిసరుకుల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కాగా.. ఈ ఏడాది మే నెల నుంచి మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం.
''గత కొన్ని నెలలుగా వ్యయాన్ని నియంత్రించి ధరలను అందుబాటులోనే ఉంచేందుకు ప్రయత్నించాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల ఆర్థిక పరిస్థితుల వల్ల అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తోంది.
ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.20 వేల వరకు పెంచాం'' అని కంపెనీ వెల్లడించింది. వినియోగదారులపై ఈ భారం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకుంటామని తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది.

# ఎస్‌బీఐలో 12,000 కొత్త ఉద్యోగాలు



దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ), ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు, నెట్‌వర్క్ విస్తరణ చేపడుతోంది. దాదాపు 12,000 మంది సిబ్బందిని కొత్తగా నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 200-250 శాఖలను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. క్లరికల్, ఆఫీసర్ క్యాడర్లలో 11,000- 12,000 నియామకాలు చేపడతామని తెలిపారు. పదవీ విరమణలు, పెరుగుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ నియామకాలు ఉంటాయని తెలిపారు. 2026 మార్చి చివరికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 25,633 నియామకాలు చేపట్టింది. కొత్తగా ఏర్పడుతున్న నివాస ప్రాంతాలు, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తామన్నారు. కొన్ని శాఖల హేతుబద్ధీకరణ అనంతరం, 2026-27లో నికరంగా 200-250 శాఖలు పెరగనున్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ చెప్పారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రూ.30,000 కోట్ల ఐపీఓలో భాగంగా, ఆ సంస్థలో తమకున్న వాటాలో దాదాపు 1% వరకు ఎస్‌బీఐ గ్రూప్ విక్రయించనుంది. ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐ 0.65% వాటాను, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ 0.35% వాటాను తగ్గించుకోనున్నాయి. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐకి 3.23%, ఎస్‌బీఐ క్యాప్‌నకు 4.33% వాటాలున్నాయి. ప్రస్తుతానికి ఇతర అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయ ప్రణాళికలేవీ లేవని శెట్టి స్పష్టం చేశారు.
ఈ ఏడాది జులైలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో దాదాపు 10% వాటాను విక్రయించి, రూ.11,675 కోట్లు విజయవంతంగా సమీకరించినట్లు గుర్తు చేశారు.

## 23,800 దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికా వడ్డీ రేట్లను పెంచుతుందనే భయాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఐటీ, మెటల్,



పీఎస్‌యూ బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ షేర్లు 3 శాతానికి పైగా కుంగాయి. టాటా స్టీల్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతం మేర పడ్డాయి. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ ఉదయం 76,446.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,515.43) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,970.52 వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 382.62 పాయింట్లు పతనమై 76,132.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టాటాస్టీల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రా సిమెంట్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎల్అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ, ఇండిగో షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 96.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,402.79 వద్ద కొనసాగుతోంది.

## డిసెంబరులోపే బొగ్గు వాణిజ్య ఉత్పత్తి




బొగ్గు తవ్వకంలోకి కొత్తగా ప్రవేశించిన ప్రభుత్వరంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ, ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరులోనే వాణిజ్య ఉత్పత్తి చేయగలమనే విశ్వాసంతో ఉంది. 2027 మార్చిలోపే 10 లక్షల టన్నుల బొగ్గును విద్యుదుత్పత్తి కోసం విక్రయించగలమని ఎన్ఎండీసీ ఛైర్మన్ అమితవ ముఖర్జీ చెప్పారు. ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ సంస్థ, దేశీయ ఇనుప ఖనిజం అవసరాల్లో 20 శాతాన్ని తీరుస్తున్న సంగతి విదితమే. 'ప్రస్తుతం మా కార్యకలాపాల్లో ఇనుప ఖనిజం తవ్వకం వాటాయే 99.9%. 2047కు వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వానికి సహకరించేందుకు, 2030కి భిన్న ఖనిజాల తవ్వకంలోకి ప్రవేశించే ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఉక్కు ఉత్పత్తిలో కీలకమైన కోకింగ్ కోల్ గనిని ఈ ఆర్థిక సంవత్సరంలోనే అభివృద్ధి చేసి, 2027-28లో ఆ వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం చుడతాం. 2030 కల్లా మా ఆదాయాల్లో కనీసం 20% ఇనుప ఖనిజం యేతర విభాగాల నుంచి ఆర్జించాలన్నది లక్ష్యం. 2030కి 100 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేయాలన్న ప్రణాళిక సాధనలోనే ముందుకు సాగుతున్నాం. 2024-25లో 44 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం తవ్వగా, 2025-26లో 20% వృద్ధితో 53 మి.ట.కు చేరాం' అని ముఖర్జీ వివరించారు.

# మహిళల వస్త్ర సముదాయం 'శ్రీ' ప్రారంభం



మహిళల మనస్సు దోచే సరికొత్త వస్త్రసముదాయం 'శ్రీ' నగరంలోని టీఎన్ఆర్ నార్త్ సిటీ మాల్‌లో మొట్టమొదటి రిటైల్ స్టోర్ను ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2026 రమ్య కైలాసా, సంస్థ సహ-వ్యవస్థాపకులు సందీప్ కపూర్, శీతల్ కపూర్ ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే మంచి ఆదరణ పొందింది. దేశ, విదేశాలలో 130 పైగా స్టోర్లతో మహిళల ఆదరణ చూరగొంది. రాబోయే రెండేళ్లలో తెలంగాణలో 20 నుంచి 25 స్టోర్లను ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. స్థానికంగా ఉపాధి కల్పిస్తూ తన ఆఫ్‌లైన్ నెట్‌వర్క్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తుంది. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కపూర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా మా వద్ద ఆన్‌లైన్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు ఉన్నారన్నారు. ఆ గణాంకాలే ఇక్కడ ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేయడానికి కారణమన్నారు. ఇక్కడ మరో 20 నుంచి 25 స్టోర్లను ప్రారంభించడం చిన్న లక్ష్యమేమీ కాదన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహ-వ్యవస్థాపకురాలు శీతల్ కపూర్ మాట్లాడుతూ హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ ప్రగతి ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మేం మహిళలను దృష్టిలో ఉంచుకునే మా దుస్తులను డిజైన్ చేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, రాత్రి 9 గంటలకు తిరిగొచ్చే మహిళలు మధ్యలో ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, అప్పుడప్పుడు పెళ్లిళ్లు, వేడుకలు ఇలా ఎన్నో చూసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికి ఆకర్షణీయంగా కనిపించే దుస్తులతో పాటు రోజంతా సౌకర్యంగా ఉండేవి కావాలన్నారు. ఈ రెండింటి కలయిక అంత సులభం కాదన్నారు. ఒక స్టోర్‌కు వచ్చినప్పుడు స్వయంగా ఫ్యాబ్రిక్ నాణ్యతను, ఫిట్టింగ్‌ను చూసుకోవచ్చన్నారు. తీరికగా ఎంచుకోవచ్చన్నారు. స్క్రీన్‌పై చూసి కొనేటప్పుడు ఈ అనుభూతి లభించదన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న రిటైల్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటిగా ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా మాల్స్, ఫ్యాషన్ రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తుండటం అనుకూల అంశం. ఈ స్టోర్‌లో ప్రత్యేకసందర్భాలకోసం రూపొందించిన చీరల నుంచి రోజువారీ కుర్తాలు, దుపట్టాతో కూడిన కుర్తా సెట్లు, కుర్తీలు, ట్యూనిక్స్, కో-ఆర్డ్స్ వంటి ఆధునిక వర్క్‌వేర్‌లతో పాటు వైడ్ లెగ్ ప్యాంట్లు, లెగ్గింగ్స్ వంటి బాటమ్ వేర్ సహా మహిళల పూర్తి స్థాయి ఎత్నిక్ వేర్ కలెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. జాతీయ స్థాయిలో 25 లక్షలకు పైగా కుటుంబాలకు చేరువైన ఈ బ్రాండ్ ఇప్పటివరకు 75 లక్షలకు పైగా దుస్తులను విక్రయించింది.




## దులీప్ ట్రోఫీ ఫైనల్.. ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ



కెప్టెన్సీతో తాను మరింత ప్రమాదకరంగా మారతానని భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ నిరూపించాడు. తాజాగా సౌత్ జోన్‌తో జరుగుతోన్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఇషాన్ (224★) అద్భుతమైన డబుల్ సెంచరీ సాధించాడు. కేవలం 270 బంతుల్లోనే పూర్తి చేయడం గమనార్హం. ఓవర్ నైట్ 385/4 స్కోరుతో ఈస్ట్ జోన్ రెండో రోజు ఆటను ప్రారంభించింది. కుమార్ కుశాగ్ర (101) సెంచరీ చేసి పెవిలియన్‌కు చేరాడు. ఇషాన్ - కుశాగ్ర ఐదో వికెట్‌కు 230 పరుగులు జోడించారు. కుశాగ్ర ఔటైన అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన అనుకుల్ రాయ్ (33★)తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. దూకుడుగా ఆడుతూ స్కోరుబోర్డును పరుగులుపెట్టించాడు. కేవలం 24 ఓవర్లలోనే వీరిద్దరూ కలిసి ఆరో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించడం గమనార్హం. ప్రస్తుతం ఈస్ట్ జోన్ 125 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 578 పరుగులు చేసింది.

# భారత్ - జపాన్ మధ్య ప్రతిష్ఠాత్మక మ్యాచ్..




ఆసియా క్రీడల ముంగిట జపాన్‌తో టీమ్‌ఇండియా ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. శానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 22న మ్యాచ్ జరగనుంది. భారత్-జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవ సంబరాల ప్రారంభ సూచికగా దీన్ని నిర్వహిస్తున్నారు. అయితే, ఈ మ్యాచ్‌కు జపాన్‌లో ఓ సమస్య ఎదురు కాగా.. ఎలా పరిష్కరిస్తానేది ఆసక్తికరంగా మారింది.
భారత్ - జపాన్ ఏకైక టీ20 మ్యాచ్ ప్రసార హక్కులను తీసుకోవాలని ఇప్పటికే ఐటీడబ్ల్యూ యూనివర్స్‌తో జపాన్ క్రికెట్ అసోసియేషన్ చర్చించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలు ప్రారంభానికి రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ జరగనుంది. దీంతో నిర్వహణపరమైన సవాళ్లు ఎదురవుతాయని బ్రాడ్‌కాస్టర్లు ఆలోచనలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికీ టీవీ బ్రాడ్‌కాస్టింగ్ కూడా ఫైనలైజ్ కాలేదు. దీంతో యూట్యూబ్‌లో లైవ్ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కేవలం జపాన్‌లోనేనని.. భారత్‌లో ఫ్యాన్‌కోడ్‌తో కలిసి బ్రాడ్‌కాస్ట్ చేసే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఐటీడబ్ల్యూ సంస్థ స్టార్, సోనీ, జీ వంటి సంస్థలతోనూ చర్చలు జరుపుతోంది.
మరోవైపు ఆసియా గేమ్స్‌లో మహిళా క్రికెట్ ఫైనల్ కూడా అదే రోజు. ఇందులో భారతే 'గోల్డ్ మెడల్' ఫేవరెట్. ఆ మ్యాచ్ ముగిసిన రెండు గంటల్లోనే భారత్ - జపాన్ పోరు జరగనుంది. దీంతో ఒకేరోజు రెండు మ్యాచులు ప్రసారం చేయడం జపాన్ బ్రాడ్‌కాస్టర్లకు సవాల్‌తో కూడుకున్నదే.
''సంప్రదాయ పరిధులను దాటి క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తం చేసేందుకు ఇలాంటి మ్యాచులు దోహదపడతాయి. అందుకు భారత్ - జపాన్ మ్యాచ్‌నే కీలక అడుగుగా భావిస్తున్నాం. 22వ తేదీన ఇరుజట్లూ తలపడతాయి. జపాన్‌కు అంతర్జాతీయ క్రికెట్ శోభను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. కొత్త అభిమానులు వస్తారు. ఈ ప్రాంతంలో క్రికెట్‌ను విస్తరించేందుకు అవకాశాలు ఏర్పడతాయి'' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

# స్వదేశం కోసం పనిచేయాలంటే భయం: పాక్ మాజీ స్టార్ సంచలన వ్యాఖ్యలు




ఏ క్రికెటర్ అయినా సరే ఆటకు వీడ్కోలు పలికినా కూడా స్వదేశానికి ఎంతోకొంత సేవ చేయడానికి ఆసక్తి చూపిస్తాడు. కానీ, పాకిస్థాన్ మాజీల్లో కొందరి పరిస్థితి ఇందుకు భిన్నం. సొంత దేశం కోసం పనిచేయాలంటే భయం వేస్తోందని పాక్ మాజీ క్రికెటర్ ముస్తాక్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇటీవల ఇంగ్లాండ్‌తో రెండు టెస్టుల్లోనూ ఘోరమైన ప్రదర్శనతో పాకిస్థాన్ టీమ్ విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. దీంతో ప్లేయర్లతోపాటు ఇద్దరు కోచ్‌లపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వేటు వేసింది. అయితే ఇలా పర్యటన మధ్యలోనే చర్యలు తీసుకోవడం సరైంది కాదని ముస్తాక్ అభిప్రాయపడ్డారు. గతంలో పీసీబీలో (PCB) పని చేసిన ఆయన.. బంగ్లాదేశ్‌కు స్పిన్ కోచ్‌గానూ వ్యవహరించారు.
''నా సొంత దేశానికి సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధమే. కోచింగ్ బాధ్యతలకూ వెనుకాడబోను. ఇప్పుడున్న ఆటగాళ్లను సవాళ్లకు సిద్ధం చేసి.. అంతర్జాతీయ క్రికెట్‌పై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, ప్రత్యర్థి జట్లకు గట్టి పోటీ ఇవ్వగల టీమ్‌ను తయారు చేయడానికి నాకు ఇదే అత్యంత అనువైన సమయం. కానీ, పీసీబీ మద్దతుగా నిలిస్తేనే ఇదంతా సాధ్యమవుతుంది. అయితే, సర్ఫరాజ్, గుల్‌ను తప్పించినప్పుడు ఓ క్రికెటర్‌గా నేను బాధపడ్డా. గౌరవం లేని చోట లేదా ఉన్నట్టుండి ఏదో కారణం చెప్పి తొలగిస్తే గనుక.. సొంత దేశం కోసం పనిచేయాలంటే భయం వేస్తుంది'' అని ముస్తాక్ వ్యాఖ్యానించారు. ఇటీవలే సెలక్టర్ పదవికి రాజీనామా చేసిన మిస్బా ఉల్ హక్ కూడా పీసీబీపై విమర్శలు గుప్పించాడు. ''విదేశీ కోచ్‌లతో పోలిస్తే ఇక్కడి కోచ్‌లతో వ్యవహరించే తీరు పూర్తి భిన్నం. ఏదైనా ఓటమి ఎదురైతే చాలు విమర్శలు ఎక్కువగా స్వదేశీ కోచ్‌లపైనే ఉంటాయి. విదేశీ కోచ్‌లు వద్దని చెప్పట్లేదు. కానీ, వారికి అథారిటీ ఎక్కువగా ఇచ్చేస్తున్నారు'' అని మిస్బా వ్యాఖ్యానించాడు. పర్యటన మధ్యలోనే ఆటగాళ్లను తప్పించడంపై సర్వత్రా విమర్శలు వస్తుంటే.. పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ మాత్రం పీసీబీకి మద్దతుగా మాట్లాడటం గమనార్హం. ''ఇప్పుడున్న జట్టు నుంచి పాక్ బోర్డు ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో కొందరిని తప్పించి.. కొత్త వారికి అవకాశం కల్పించింది. పాక్ జట్టు తరఫున నిబద్ధతతో ఆడే వారికే ఛాన్స్ ఇచ్చింది. అయితే, షహీన్ షా, నసీమ్ షా, హారిస్ రవూఫ్ విషయంలో బోర్డు కాస్త జాగ్రత్తగానే వ్యవహరించాలి. వీరు పాక్ క్రికెట్‌కు కీలక సభ్యులు. కొత్త జనరేషన్ నుంచి మరీ భారీ అంచనాలు పెట్టుకోవద్దు'' అని అక్తర్ సూచించాడు.

# ఇషాన్ అజేయ శతకం



ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్‌కు అదిరే ఆరంభం. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111 బ్యాటింగ్; 135 బంతుల్లో 14×4, 1×6) అజేయ శతకం బాదడంతో మొదటి రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. శిఖర్ మోహన్ (85), అభిమన్యు ఈశ్వరన్ (72), కుమార్ కుశాగ్ర (63 బ్యాటింగ్), వైభవ్ సూర్యవంశీ (44) కూడా రాణించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు అభిమన్యు, వైభవ్ తొలి వికెట్‌కు 100 పరుగులు జోడించారు. అయితే ఈ ఓపెనర్లతో పాటు సుదీప్ కుమార్ (6) కొద్ది తేడాలో ఔట్ కావడంతో ఈస్ట్ 147/3తో నిలిచింది. మరో వికెట్ పడుంటే ఆ జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారేదే. ఈ దశలో ఇషాన్.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దూకుడైన ఆటతో స్కోరు బోర్డును నడిపించాడు. చక్కని షాట్లతో అలరించిన అతడు.. 71 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. మరో 51 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్‌కు శిఖర్ మోహన్, కుశాగ్ర చక్కని సహకారాన్నిచ్చారు. శిఖర్‌తో నాలుగో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్.. కుశాగ్రతో అభేద్యమైన అయిదో వికెట్‌కు 144 పరుగులు జోడించాడు. సౌత్‌జోన్ బౌలర్లలో చామా మిలింద్ (2/56) రాణించాడు.

# మళ్లీ డ్రామా చేసేందుకేనా వచ్చేది?

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ ఆసియా కప్ విషయంలో మరోసారి తన కపట బుద్ధిని ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారా? ఈ సందేహానికి ప్రధాన కారణం.. 'చీఫ్ గెస్ట్'గా ట్రోఫీ ప్రజెంటేషన్‌కు నఖ్వీ వస్తున్నట్లు వార్తలు రావడమే..! దీంతో గతేడాదిలా ఆయన మళ్లీ రసాభాస చేస్తాడనే విమర్శలు మొదలయ్యాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ గుర్తుందా.. ఫైనల్‌లో టీమ్‌ఇండియా గెలిచింది. కానీ, ఆసియా క్రికెట్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా కప్పును తీసుకొనేందుకు భారత్ విముఖత చూపింది. దానికి కారణం అతడు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గానూ ఉన్నారు. ఇక్కడే మోసిన్ నఖ్వీ 'జిత్తుల మారి'గా వ్యవహరించారు. ట్రోఫీని తానే ఇస్తానంటూ గదిలోకి తీసుకెళ్లి పెద్ద డ్రామా చేశారు. చివరకు ఆనాటి టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఖాళీగానే తన జట్టుతో కలిసి స్వదేశానికి వచ్చాడు. ఆ తర్వాత ట్రోఫీని ఏసీసీ కార్యాలయంలో ఉంచారు. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోసిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు.



మళ్లీ సేమ్ డ్రామాను పునరావృతం చేసేందుకే అన్నట్లుగా మహిళల ఆసియా కప్ ఫైనల్‌కూ ఆయన చీఫ్ గెస్ట్‌గా వస్తారనే ప్రచారం సాగుతోంది. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం టోర్నీ లీగ్ స్టేజ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే భారత్ సెమీస్‌కు చేరుకుంది. పాకిస్థాన్ పోరాడుతోంది. టైటిల్ ఫేవరెట్‌గా భారత మహిళా జట్టే ఉంది.


వుదయం సినిమా MOVIE TIME!

# మహేంద్రగిరి వారాహి ప్రీరిలీజ్ ఈవెంట్



**వుదయం సినిమా:** సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో కనిపిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అఖిల్ అక్కినేని ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ఇలాంటి మంచి ప్రాజెక్ట్ నిర్మించిన లక్ష్మణ్ గారికి కంగ్రాచ్యులేషన్స్. ఈ రోజుల్లో ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే అలాంటి కంటెంట్‌ను అందించగలగాలి. ఇప్పుడు టీజర్, ట్రైలర్ చూస్తుంటే ఖచ్చితంగా ఇది ప్రేక్షకులు థియేటర్‌లో చూడదగ్గ సినిమా అనిపిస్తుంది. ఇలాంటి నిర్మాతలు మన పరిశ్రమకు మరింతమంది కావాలి. నేను చిన్నప్పటి నుంచి సుమంత్ అన్న ఒడిలోనే పెరిగాను. నాకు ఏది కావాలన్నా ఎక్కువగా సుమంత్‌నే అడిగేవాడిని. ఒక్కరోజు కూడా ఆయన ఎప్పుడూ నాకు నో చెప్పలేదు. ఈరోజు ఆయన ఫంక్షన్‌కు వచ్చి మాట్లాడుతుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. చాలా పాజిటివ్ ఫీలింగ్. ఐ లవ్ యూ బ్రదర్. సిద్దుకి థాంక్స్ చెప్పాలి. ఎందుకంటే ఆయన సినిమాలు పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. కానీ ఆయన వేరే సినిమా కోసం సపోర్ట్ చేస్తూ ఇందులో చేయడం నిజంగా అభినందనీయం. ఏదో ఒక రోజు ఆయన సినిమాలో నేను కూడా భాగం కావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ సంతోష్ గారు ఈ సినిమా కోసం తన ప్రాణం పెట్టి పనిచేశారు. 'మహేంద్రగిరి వారాహి'లాంటి కంటెంట్ ఉన్న సినిమా తీసుకొస్తున్నారు. ఈ సినిమా ఆడబోతుంది. చాలా పెద్ద హిట్ అవ్వబోతుందని నమ్మకం ఉంది. ఇంత మంచి కంటెంట్ బేస్ ఉన్న సినిమాని ఇస్తున్నందుకు టీమ్‌కి కంగ్రాజులేషన్స్. సెప్టెంబర్ 11న అందరూ థియేటర్‌లో చూడండి. మంచి కంటెంట్ ఎంజాయ్ చేయండి. అందరికీ థాంక్యూ. లవ్ యూ ఆల్. హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ముందుగా లెనిన్ తో బ్లాక్‌బస్టర్ కొట్టిన అఖిల్ గారికి కంగ్రాజులేషన్స్. ఆయన హార్డ్ వర్క్ స్క్రీన్ మీద కనిపించింది. చివరి 40 నిమిషాలు చూసి షాక్ అయ్యాను. అంత అద్భుతంగా చేశారు.

# "రణబాలి" టీజర్ రిలీజ్



**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు మేకర్స్ "రణబాలి" సినిమా టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 9న ఈ సినిమా టీజర్ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. "రణబాలి" సినిమా టీజర్ పై అటు విజయ్ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ లో భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. వారి అంచనాలు మించి టీజర్ ఉంటుందని మేకర్స్ కాన్ఫిడెంట్ గా చెబుతున్నారు.

# పూజ కార్యక్రమాలతో #LUB చిత్ర ప్రారంభం



**వుదయం సినిమా:** జెజె ఆర్ట్ మూవీస్, పవనసుత ప్రొడక్షన్స్, గాయత్రి సినిమాస్ బ్యానర్స్ సంయుక్తంగా మహేష్ కుమార్ సంక, భగవాన్ నిర్మాతలుగా మణికంఠ పెదమల్లు తొలి దర్శకునిగా పరిచయంఅవుతూ ప్రారంభమైన చిత్రం #LUB. ఈ చిత్రం ద్వారా పవన్ కేసరి, ప్రాముఖ్య హీరో హీరోయిన్ గా పరిచయం అవుతుండగా అభితేజ్, జెడివి ప్రసాద్, మల్లిక లెల్ల, సాయికిరణ్, రోమాంచకం ఫేమ్ మధు, విశ్వనాథ్ & సన్స్ ఫేమ్ హారిక, భాను ప్రకాష్ కడియాల, మోత రాజేందర్ తదితరులు కీలక పాత్రలు పోషించనున్నారు. అక్షయ్ వసూరి డిఓపిగా పని చేస్తున్న ఈ చిత్రానికి కార్తికేయన్ రోహిణి ఎడిటర్ గా, సుధ శ్రీనివాస్ సంగీత దర్శకుడిగా, లిరికల్ రైటర్ గా జైలర్ 2, ఓజి ఫేమ్ శ్రీనివాస మౌళి పని చేయనున్నారు. ప్రముఖ రచయిత బివిఎస్ రవి ఈ చిత్రానికి క్లాప్ చేయగా హనుమాన్ చిత్ర నిర్మాత చైతన్య రెడ్డి గారు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్ చిత్ర దర్శకుడు మణికంఠ దర్శకత్వం చేయగా స్క్రిప్టును క్రేజీ కల్యాణం చిత్ర నిర్మాత బి జగన్ మోహన్ రెడ్డి గారు, బివిఎస్ రవి గారు అందజేశారు. ఈ ఈవెంట్ కు హాజరైన సంబరాల ఏటిగట్టు చిత్ర దర్శకుడు రోహిత్ కెపి, దర్శకుడు సముద్ర, నిర్మాతలు లగడపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఈ చిత్ర యూనిట్ కు తమ బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా నటుడు పవన్ కేసరి మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. మా చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్య అతిథులకు, మీడియా వారికి ధన్యవాదాలు. జెజె ఆర్ట్ మూవీస్, పవనసుత ప్రొడక్షన్స్, గాయత్రి సినిమాస్ బ్యానర్స్ పై రానున్న #LUB చిత్రం రోమ్ కోమ్, కామెడీ, లవ్ తో కూడిన ఎమోషన్ ఉన్న చిత్రం. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్.

# 'ఓం: చాప్టర్ 1-ఉధిరం' మూవీ నుంచి వీడియో గ్లింప్స్

**వుదయం సినిమా:** హీరో ధనుష్ లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'ఓం: చాప్టర్1–ఉధిరం'. ఇప్పటి వరకు విడుదలైన టైటిల్ ఫస్ట్ స్ట్రైక్ వీడియో, 'అలా కా లూవా' సాంగ్ ఫ్యాన్స్, సినీ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని, ఆసక్తిని నింపింది. ఈ క్రమంలో ఓం మూవీలో కీలక పాత్రలో నటించిన మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి పుట్టినరోజు (సెప్టెంబర్ 7) సందర్భంగా ఆయన పాత్రకు సంబంధించిన బర్త్ డే స్పెషల్ వీడియో గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.'ఓం: చాప్టర్1–ఉధిరం' చిత్రంలో మమ్ముట్టి పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఆయన గురించి ఇంటర్‌పోల్ ఆఫీసర్స్ వెతుకుతుంటే ఆయనేమో తనకేమీ పట్టనట్లు క్రికెట్ మ్యాచ్ చూస్తుండటం వంటి సీన్స్‌ను ఈ బర్త్ డే స్పెషల్ వీడియోలో చూడొచ్చు. అసలు మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతుందోనని ఎదురు చూసిన వారందరికీ ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా స్టైలిష్‌గా ఉంటూనే క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింతగా పెరిగాయి. ధనుష్ పాత్రకు, మమ్ముట్టి పాత్రకు ఎలాంటి కాంపీటీషన్ ఉండబోతుంది.. ఈ రెండు పాత్రలు సిల్వర్ స్క్రీన్‌పై ఎలా అలరించబోతున్నాయోననే ఆసక్తి పెరిగింది.రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్నఓం: చాప్టర్1– ఉదిరం: ది బ్లడ్ ఉడ్ ప్రతిష్టాత్మక కాంబినేషన్‌లో రూపొందుతోంది. ఈ చిత్రంలో ధనుష్, సాయి పల్లవి, శ్రీలీల, మమ్ముట్టి, నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ బ్యానర్స్‌పై శ్రద్ధా అగర్వాల్, ధనుష్, అజ్మత్ జగ్మగ్ నిర్మిస్తోన్న ఈ సినిమా అక్టోబర్ 16న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతోంది.



# ప్రొడక్షన్ నెం.3 సినిమా షురూ



**వుదయం సినిమా:** "ఎస్ఆర్ కళ్యాణమండపం" చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించి దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్ పై ఆది సాయి కుమార్ తో చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో "హైవే" వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు, లిఖిత హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో హైదరాబాద్ లో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకులు కోదండరామిరెడ్డి క్లాప్ ఇచ్చి, దర్శక నిర్మాతలకు స్క్రిప్ట్ అందజేశారు. దర్శకుడు వీరభద్రం చౌదరి కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని డైరెక్టర్ కోదండ రామిరెడ్డి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే హారర్ చిత్రమిది. ఈ సినిమాను సరికొత్త కథా కథనాలతో దర్శకుడు శ్రీధర్ గాదె ప్రేక్షకులకు చూపించబోతున్నారు. ఈ మూవీ ప్రారంభోత్సవం సందర్భంగా రిలీజ్ చేసిన అనౌన్స్ మెంట్ పోస్టర్ వినూత్నంగా ఉండి ఆసక్తి రేపుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# "టార్టాయిస్" సాంగ్ లాంచ్

**వుదయం సినిమా:** రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "టార్టాయిస్". ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "టార్టాయిస్" సినిమాను ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్, సంతోష్ ఇమ్మడి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ తో అందరి దృష్టినీ ఆకర్షించిందీ సినిమా. ఈ రోజు ఈ చిత్రంలోని 'నీ పరిచయం..' పాటను హైదరాబాద్ లో గ్రాండ్ గా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోలిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ – ప్రేమ, ఆర్తి, అక్కెరతో కూడుకున్న పాట ఇది. ఈ పాటను అత్యద్భుతంగా కంపోజ్ చేసిన అనూప్ గారికి, అంతే అద్భుతంగా పాడిన చిన్మయి గారికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఈ చిత్ర దర్శకుడు రిత్విక్ కుమార్, నిర్మాతలు విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబుకు నా అభినందనలు చెబుతున్నా.



# 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' ప్రేక్షకుల హృదయాలను దోచుకుంటుంది..

**వుదయం సినిమా:** ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతుండటం విశేషం. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. యువతలో భారీ అంచనాలను ఏర్పరచుకున్న 'ఎపిక్' చిత్రం, సెప్టెంబర్ 11న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన చిత్ర దర్శకుడు ఆదిత్య హాసన్, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**మీ కుటుంబ నేపథ్యం ఏంటి? సినీ పరిశ్రమలోకి ఎలా వచ్చారు?** మాది వనపర్తి. టెన్త్ వరకు అక్కడే చదువుకున్నాను. మా నాన్న స్కూల్ టీచర్ గా రిటైర్ అయ్యారు. అమ్మ హౌస్ వైఫ్. అన్న, వదిన బ్యాంక్ ఉద్యోగం చేస్తున్నారు. టెన్త్ తర్వాత నాకు సినిమాపై ఆసక్తి పెరిగింది.

**90s వెబ్ సిరీస్ అవకాశం ఎలా వచ్చింది?**

– మా నాన్న గారి నిజజీవితం ఆధారంగా 90s కథ రాసుకున్నాను. మొదట ఒక ఓటీటీ సంస్థ ఆ కథ నచ్చి, నిర్మించడానికి ముందుకొచ్చింది. కానీ, ఆరు నెలల తర్వాత వెనకడుగు వేశారు. అప్పటికే ఆ కథ గురించి తెలిసిన ఈటీవీ విన్ సాయి గారు, నితిన్ గారు పిలిచారు. అలా 90s వెబ్ సిరీస్ తెరపైకి వచ్చింది. **మీకు ఆదిత్య హాసన్ పేరు ఎలా వచ్చింది?**

– నా అసలు పేరు ఆదిత్య. నేను కమల్ హాసన్ గారి వీరాభిమానిని. ఆ అభిమానంతోనే నా పేరును ఆదిత్య హాసన్ గా మార్చుకున్నాను.

**'ఎపిక్' సినిమా మీ బయోపిక్ అంటున్నారు నిజమేనా?**

– నిజ జీవిత సంఘటనల స్ఫూర్తి ఖచ్చితంగా ఉంటుంది. కానీ, నా జీవితం మాత్రం అంత అందంగా లేదు (నవ్వుతూ). ఎంతో కొంత సినిమాటిక్ లిబర్టీ తీసుకుంటాము.

**'ఎపిక్' సినిమా ఎలా ఉండబోతుంది?**

– ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. మన నిజ జీవితంలోని కొన్ని కొన్ని అందమైన సంఘటనల ఆధారంగా కథ ఉంటుంది.

**నిర్మాత నాగవంశీ గారి గురించి?**

– 90s వెబ్ సిరీస్ చూసి, నన్ను నమ్మి నాగవంశీ గారు ఈ అవకాశం ఇచ్చారు. ప్రతిదీ దగ్గరుండి వంశీ గారు చూసుకున్నారు. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఎంపిక కూడా వంశీ గారిదే.

**గోరటి వెంకన్న గారు ఈ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?**

– నాకు చిన్నప్పటి నుంచి గోరటి వెంకన్న గారంటే అభిమానం. నేను లండన్ లో చదువుకునే రోజుల్లో కూడా ఆయన పాటలే వింటూ ఉండేవాడిని. నా మొదటి సినిమాలో ఖచ్చితంగా ఆయన పాట ఉండాలి అనుకునేవాడిని. అందుకే ఎపిక్ సినిమాలో గోరటి వెంకన్న తో 'సంచారమే'రాయించి, పాడించి.. ఆపాటతోనే ప్రమోషన్స్ మొదలుపెట్టాము.


దర్శకుడు ఆదిత్య హాసన్

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.